

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం  తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA  RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 20.11.2025 | సంపుటి : 2 | సంచిక :286 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Thuesday | 20.11.2025 | volume : 2 | Issue : 286 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

### అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 19 : నాంపల్లిలోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు


మిగతా 2 లో

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

### రేపటి నుంచి ఈనెల 23 వరకు ఓటర్ల జాబితా సవరణ

### డిసెంబరు రెండో వారంలో ఎన్నికల షెడ్యూలు!

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రేపటి నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది.




హైదరాబాద్: 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో

మిగతా 2 లో

# మారేడిమిల్లిలో మరో భారీ ఎన్‌కౌంటర్

### ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతం

టెక్ శంకర్, నంబాల తదితరులు ఉన్నట్లు సమాచారం



04

మారేడిమిల్లిలో బుధవారం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. వీరంతా హిడ్మా ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న వారేనని పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అలాగే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.



02

## సత్యసాయి మనతోనే ఉన్నారు

### అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

### ఆయన అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచాయి

### సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో ప్రధాని మోడీ

సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పుట్టపర్తిలో నిర్వహించిన సత్యసాయి శత జయంత్యుత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారు. భౌతికంగా బాబా లేకున్నా... ఆయన ప్రేమ మనతోనే ఉంది. సత్యసాయి బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తోంది. కోట్ల మంది ఆయన భక్తులు మానవ సేవ చేస్తున్నారు. సత్యసాయి ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయి.

### పిఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ

చెన్నై, నవంబర్ 19 : రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న

-మిగతా 2 లో..

# ఇందిరమ్మ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం

### పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

### ఇందిరాగాంధీకి నివాళులర్పించిన సీఎం రేవంత్


### జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ



పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 19 : మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు

-మిగతా 2 లో..




## అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లకు ఇక మోక్షం

### బ్యాంకులో వివరాలు సమర్పించి పొందవచ్చు

ముంబై, నవంబర్ 19 : బ్యాంకులు, లేదా నాన్ బ్యాంకింగ్ సంస్థల్లో మదుపు చేసి మర్చిపోయిన, లేదా మిగులు సొత్తు మీకు దక్కే ఛాన్స్ ఇప్పుడు వచ్చింది. కేంద్రం ఇటీవల ఈ సొమ్ములు తీసుకునేందుకు చాలా సులువైన వెసులుబాటు కల్పిస్తోంది. ఈ సొత్తుకు మీరు హక్కుదారులు, లేదా వారసులైన ఎడల నిరుపయోగంగా బ్యాంకుల్లో ఉండిపోయిన సదరు

-మిగతా 2 లో..




## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

### ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి

హైదరాబాద్, నవంబర్ 19 : పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి

-మిగతా 2 లో..

# విరాళరూపంలో 415 కోట్లు వసూలు

### అక్రమంగా నిధులు సమీకరించినట్లు ఆరోపణలు

### కస్టడీకి అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు చైర్మన్ సిద్దిక్

### విచారణలో పలు కీలక ఆధారాల సేకరణ

అల్ ఫలాహ్ గ్రూపు చైర్మన్ జావద్ అహ్మద్ సిద్ధిక్‌కు విరాళాల రూపంలో 415 కోట్లు అందినట్లు ఈడీ పేర్కొన్నది. తన ట్రస్టుకు చెందిన విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి అక్రమ రీతిలో ఆ నిధులను సమీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గల్ఫ్‌లో ఫ్యామిలీ సభ్యులు స్థిరపడడం వల్ల అక్కడికి పారిపోయే ఆలోచనలో ఆయన ఉన్నట్లు తెలిసింది.

న్యూఢిల్లీ, నవంబర్ 19 : ఫరీదాబాద్‌లో రోజంతా జరిగిన తనిఖీల తర్వాత అల్ ఫలాహ్ వర్సిటీ గ్రూపు చైర్మన్ సిద్దిక్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఈనెల 10వ తేదీన జరిగిన ఎర్రకోట కారు పేలుడు ఘటనతో వర్సిటీకి లింకు ఉన్న కారణంగా ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. 13 రోజుల

-మిగతా 2 లో..





# అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు

## ప్రధాని మోదీ

**పుట్టపర్తి, నవంబర్ 19 :** 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు'.. ఇదే ఆయన నినాదం. చాలా మంది జీవితాలను సత్యసాయి సమూలంగా మార్చేశారు. లక్షల మందిని సేవామార్గంలో నడిపించారు. ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారు. పుట్టపర్తి పవిత్ర భూమిలో ఏదో మహత్తు ఉంది. సత్యసాయి సంస్థలన్నీ ఇలాగే ప్రేమను పంచుతూ వర్థిల్లాలని మోదీ అన్నారు. అంతకు ముందు సత్యసాయి జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్,నటి ఐశ్వర్యారాయ్ తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తికి రావడం ఎంతో సంతోషంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు.ప్రేమ, శాంతితో కూడిన వసుదైక కుటుంబ భావన సత్యసాయిదని తెలిపారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని అన్నారు. మానవ జీవితంలో సేవ చాలా ముఖ్యమని సత్యసాయి చెప్పారని గుర్తుచేశారు. అందరినీ ప్రేమించాలి.. అందరికీ సేవ చేయాలి.. ఇదే బాబా నినాదమని వివరించారు. గుజరాత్ భూకంపం వచ్చినప్పుడు బాబా సేవాదళ్ సేవలందించిందని గుర్తుచేశారు. పేదలకు ఎప్పుడు ఆపద వచ్చినా.. బాబా సేవాదళ్ ఆదుకుంటుందని ప్రశంసించారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలందించారనిపేర్కొన్నారు.





# విరాళరూపంలో 415 కోట్లు వసూలు

(మొదటిపేజీ తరువాయి)

పాటు ఈడీ కస్టడీకి ఆయన్ను అప్పగించారు. తప్పుడు అక్రెడిటేషన్, గుర్తింపు చూపిస్తూ విద్యార్థులు, పేరెంట్స్ నుంచి ఆ వర్సిటీ భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ రూపంలోనే 415 కోట్లు సేకరించినట్లు తెలుస్తున్నది. పరారీ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో అతన్ని కస్టడీలోకి తీసుకుంటున్నట్లు ఈడీ పేర్కొన్నది. 1990 నుంచి అల్ ఫలాహ్ వర్సిటీ అంచలంచెలుగా ఎదిగిందని, ఇప్పుడు ఓ పెద్ద విద్యాసంస్థగా మారినట్లు తెలిపింది. అల్-ఫలా యూనివర్సిటీపై మంగళవారం ఈడీ అధికారులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో యూనివర్సిటీ తప్పుడు అక్రిడిటేషన్ ఆధారంగా విద్యార్థుల నుంచి మొత్తం రూ.415.10 కోట్లు వసూలుచేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపినట్లు గుర్తించామన్నారు. ఎటువంటి గుర్తింపు లేకుండానే విశ్వవిద్యాలయాన్ని నిర్వహిస్తూ.. ఫీజులు వసూలుచేస్తున్నట్లు ఆరోపించారు. విశ్వవిద్యాలయానికి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీల ప్రాంగణంలో దాడుల అనంతరం మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్ అహ్మద్ సిద్ధిఖీని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నారు. సోదాల్లో రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు తెలిపారు. 2014-15 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్నులలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా సంపాదిస్తున్న ఈ నిధులను ఎక్కడికి మళ్లిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేదించిన సంగతి తెలిసిందే. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. దీంతో దీని పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం అల్-ఫలా విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో ఢిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట ఇవి నమోదయ్యాయి. మరోవైపు.. విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది.

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)




పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

# పాలనలో ఇందిరాగాంధీ ఓ రోల్‌మోడల్

(మొదటిపేజీ తరువాయి)



మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ పక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు.ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది.

తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

# పీఎం కిసాన్ నిధులు విడుదల చేసిన మోడీ

(మొదటిపేజీ తరువాయి)

పీఎం- కిసాన్ నిధులు విడుదలయ్యాయి. ఈ పథకం కింద 21వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా నిధులు జమకానున్నాయి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభమైంది. పీఎం కిసాన్ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది రైతు కుటుంబాలకు లబ్ది చేకూరుతోంది. ఇప్పటి వరకు 20 విడతల్లో రూ.3.70 లక్షల కోట్లకు పైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. భూమి వివరాలు పోర్టల్‌లో నమోదై ఉండి, బ్యాంకు ఖాతా ఆధార్‌తో లింక్ అయి ఉన్న రైతులకు పథకం ప్రయోజనాలు అందుతున్నాయి.



# గ్రూప్-2 తీర్పుపై అప్పీలుకు వెళ్లనున్న టీజీపీఎస్సీ

**హైదరాబాద్:** గ్రూప్-2 2015 ఎంపిక జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లాలని టీజీపీఎస్సీ భావిస్తోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను కమిషన్ పరిశీలించింది. గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు లోబడి ఫలితాలు వెల్లడించినందున, ఆ అంశాలను పేర్కొంటూ అప్పీలు దాఖలు చేయనుంది. ఎంపికైన అభ్యర్థులందరూ ఆరేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ తీర్పుపై ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారూ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. గ్రూప్-2 సర్వీసుల పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ తొలుత 2015లో 439 పోస్టులతో ప్రకటన జారీ చేసింది. ఆ తర్వాత 593 అదనపు పోస్టులు గుర్తించడంతో 2016లో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేస్తూ మొత్తం 1,032 పోస్టులుగా పేర్కొంది. 7.89 లక్షల మంది దరఖాస్తు చేయగా 2016 నవంబరు 11, 13 తేదీల్లో రాతపరీక్షలు నిర్వహించింది. కొందరు అభ్యర్థులు వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు చేయడం, వాటిని వైట్‌నర్‌తో దిద్దడంతో న్యాయవివాదం తలెత్తింది. రెండేళ్లపాటు ఈ వివాదం కొనసాగింది. సాంకేతిక కమిటీ సిఫార్సుల మేరకు మూల్యాంకనం చేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ సిఫార్సులకు విరుద్ధంగా మూల్యాంకనం చేశారంటూ కొందరు అభ్యర్థులు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎంపిక జాబితా చెల్లదంటూ రద్దు చేసింది.

# దేవాదాయశాఖలో ధార్మిక పోస్టుల భర్తీకి ఆదేశాలు

**హైదరాబాద్:** దేవాదాయశాఖ పరిధిలోని పలు దేవాలయాల్లో ఖాళీగా ఉన్న ధార్మిక పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు దేవాదాయశాఖ డైరెక్టర్ ఎస్.హరీశ్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు, వంటచేసే వారు, మృదంగం వాయించే వారు ధార్మిక పోస్టుల పరిధిలోకి వస్తారు. ఆలయాల వారీగా ధార్మిక పోస్టుల ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)లను దేవాదాయశాఖ ఆదేశించింది. గతంలో ఏ ఆలయానికి ఆ ఆలయ ఈవో ఈ ప్రక్రియను చేపట్టే విధానం ఉండేది. రాష్ట్రవ్యాప్తంగా 6ఏ, 6బీ, 6సీ.. విభాగాల ఆలయాలు అన్నింట్లో ఒకేసారి ఈ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించిన దేవాదాయశాఖ ఈ నెల 14న ఆదేశాలు జారీ చేసింది. ఆలయాల వారీగా పోస్టుల భర్తీకి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని స్పష్టం చేసింది.

# అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లకు ఇక మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

సొమ్ములు చాలా సులభంగా మీ చేతికి వస్తాయి. బ్యాంకుల్లో మిగిలిన చిన్న మొత్తాలు, డిపాజిట్లు, ఇలా ఎన్నో వివరాల గురించి చాలా మందికి తెలియక పోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. భారత రిజర్వ్ బ్యాంక్ ప్రకారం, బ్యాంకు ఖాతాల్లో 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం అలా మిగిలిన డబ్బులు 'అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు'గా పరిగణించబడతాయి. ఇవి సేవింగ్స్, కరెంట్ అకౌంట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, లోన్ బ్యాలెన్స్‌లు, చెక్‌లు, ట్రాన్స్‌ఫర్లు, ప్రీపెయిడ్ కార్డుల్లో మిగిలిన మొత్తాలు లేదా విదేశీ కరెన్సీ డిపాజిట్లు కూడా ఉండవచ్చు. ఇటువంటి మొత్తాలు బ్యాంకులు నెలవారీగా సమీక్షించి, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌కి బదిలీ చేస్తాయి. ఈ సొమ్ములే ఇప్పుడు అర్హులైన వారికి అందజేసేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి గత నెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఒక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ పక్రియ చాలా సులభం, ఇంకా వేగవంతం కూడా. మీ బ్యాంకు ఖాతా వివరాలను చూసుకోండి. బ్యాంకు వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ అయి, పాత ఖాతాలు లేదా మెచ్యూరిటీ పూర్తయిన ఈఆలను తనిఖీ చేయండి. ఖీఃఎ వెబ్‌సైట్‌లో ఆఇం సెక్షన్‌లో కూడా మీరు చెక్ చేయవచ్చు. లేని పక్షంలో బ్యాంకు బ్రాంచ్‌లో సహాయం తీసుకోచ్చని ఆర్‌బిఐ సూచించింది.

# రాష్ట్ర భవిష్యత్తును 'విజన్ డాక్యుమెంట్'లో ఆవిష్కరిస్తాం

- గ్లోబల్ సమిట్‌ను పెద్ద పండగలా నిర్వహిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్:** రెండేళ్లలో సాధించిన ప్రగతి, రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలను ప్రపంచానికి చూపడమే తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబులతో కలసి అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులతో ఏర్పాటు చేసిన '2047 విజన్ డాక్యుమెంట్' వార్‌రూమ్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. "3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యసాధనలో అందరినీ భాగస్వాములను చేయాలి. 2047 సమగ్ర విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఐఎస్‌బీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే వివిధ శాఖల సమాచారంతో ఐఎస్‌బీ బృందం ప్రాథమిక కసరత్తు పూర్తిచేసింది. వచ్చే నెల 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమిట్‌కు తక్కువ సమయం ఉన్నందున అధికారులంతా డాక్యుమెంట్ పూర్తికి శ్రద్ధగా పనిచేయాలి. ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం అనే అంశాలను ఇందులో వివరించనున్నాం. ఏ పద్ధతుల్లో పనిచేస్తే 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధిస్తాం అనేది చెప్పాలి. రాష్ట్రంలో మంచి వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులున్నాయి. ఫార్మా, ఐటీ రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇవన్నీ పెట్టుబడిదారులను ఆకర్షిస్తాయని డాక్యుమెంట్లో వివరించాలి. భవిష్యత్తులో ఏం చేయబోతున్నామనేది వివరించేందుకు అనేక రంగాల నిపుణులు, ప్రముఖ కంపెనీల సీఈఓలను ఆహ్వానించి గ్లోబల్ సమిట్‌ను పెద్ద పండగలా నిర్వహించనున్నాం. గురువారం అన్ని శాఖల కార్యదర్శులు మంత్రులతో చర్చించి డాక్యుమెంట్‌ను తుది దశకు తీసుకువస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి మరో మూడు రోజులు చర్చించి ఆమోదిస్తారు. రూ.27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేసింది. ఇలాంటి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని అధికారులకు భట్టి వివరించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... "రూ.36 వేల కోట్లతో చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే దేశంలోని ఏ రాష్ట్రం కూడా తెలంగాణతో పోటీపడలేదు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 39 రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు రానున్నాయి. వీటి ద్వారా పెద్దమొత్తంలో పెట్టుబడులు వస్తాయి. గత రెండేళ్లలో కేవలం రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.85 వేల కోట్లకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలిచ్చినట్లు తేలింది అని చెప్పారు.

## పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం: భట్టి

రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని, దానికి రష్యా బృందం ఆసక్తి కనబరుస్తోందని భట్టి తెలిపారు. ప్రజాభవన్‌లో గ్లోబల్ ట్రేడ్, టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వీటీబీ రష్యన్ బ్యాంక్ ప్రతినిధులు బుధవారం భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గధామమని భట్టి వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.



# ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

(మొదటిపేజీ తరువాయి)

ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు. పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసుపై ఈడీ దృష్టి సారించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు గత శనివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేశారు. ఓటీటీ వేదికల్లోని కంటెంట్ సహా కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించాడు. గత ఏడేళ్లుగా ఐ బొమ్మ, బప్పం, ఐవిన్, ఐరాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు నిర్వహించాడు.

# సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)



ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహ పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత మట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. పోలీసుల కళ్లుగప్పి ఆమె ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకుని మట్టడికి ప్రయత్నించారు.

# జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్లతో గెలుపు

- ఎలా గెలిచారో రేవంత్‌కు తెలియదా
- బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- జూబ్లీహిల్స్ నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, నవంబర్ 19 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచిందో రేవంత్‌రెడ్డి అంతరాత్మకు తెలుసునని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. కర్నాటక నుంచి మనుషులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయించారన్నారు. షేక్‌పేట, ఎర్రగడ్డలో రిగ్గింగ్‌కు పాల్పడ్డారన్నారు. రాయించి, వేయించుకున్న ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచారన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు, మాగంటి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మాగంటి సునీతకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. సునీతాగోపీనాథ్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పని చేశారన్నారు. వచ్చే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని ఆరోపించారు. విషాదంలో ఉన్న హరీశ్‌రావు అంకితభావంతో పని చేశారని, స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపు కోసం అందరి కృషి చేద్దామన్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉన్నా పూర్తి అండగా ఉంటామన్నారు. ఎవరికి సమస్య వచ్చినా తెలంగాణ భవన్‌కు రావొచ్చునన్నారు. డిసెంబర్‌లోగా సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, స్థానిక ఎన్నికలు పూర్తి కాగానే బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. బూత్‌లవారీగా పటిష్టంగా పార్టీ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జూబ్లీహిల్స్‌లో 407 బూతుల్లో ఒక్కో బూత్‌కు 10 మంది చొప్పున పార్టీని పటిష్టం చేసుకోవాలన్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలని.. ప్రజా సమస్యలపై పోరాటం ఇప్పటి నుంచే మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ చేయాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందన్నారు. జూబ్లీహిల్స్‌లో సాంకేతికంగా మాత్రమే కాంగ్రెస్ గెలుపని.. జూబ్లీహిల్స్‌లో నైతిక గెలుపు సునీత, బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. బీఆర్ఎస్ నేతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18వేల ఓట్లు మాత్రమే వచ్చాయని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 75వేల ఓట్లు సంపాదించామని తెలిపారు.

మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని కాంగ్రెస్ గుర్తించిందని.. బీఆర్ఎస్‌కు భయపడి అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని, బీఆర్ఎస్‌ను చూసి కాంగ్రెస్ పార్టీ గడగడలాడిపోయిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, మజ్లిస్ ఒక వైపు, బీఆర్ఎస్ పార్టీ ఒంటరి పోరాటం చేసిందన్న హరీశ్.. అధికార దుర్వినియోగంతో గెలిచిన విషయం రేవంత్‌రెడ్డికి తెలుసునన్నారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓడిపోయినా తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిందన్నారు. త్వరలోనే మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. కేటీఆర్, తలసాని సహా తామంతా కలిసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. జీహెచ్ఎంసీ, ఇతర ఎన్నికలకు సిద్ధంగా ఉందామని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## నక్సలైట్లు లొంగుబాటుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, నవంబర్ 19 :** నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగిపోవాలని పదేపదే కేంద్రం హెచ్చరిస్తూ వచ్చిందన్నారు. వారు జనజీవన స్రవంతిలో కలిస్తే మంచి భవిష్యత్ ఉండేదన్నారు. కానీ కొందరు పెడచెవిన పెట్టారని అన్నారు. నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులేనని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాంఅని బండి సంజయ్ అన్నారు. ఆ మేరకు నక్సలిజం అంతం అవుతుందన్నారు. వారికి ప్రజల మద్దతు లేదన్నారు.

## హిడ్మాను చంపి.. ఎన్‌కౌంటర్ అంటారా

- మావోయిస్టులపై దాడులను వెంటనే ఆపాలి
- సిపిఐ నేత, ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్



**హైదరాబాద్, నవంబర్ 19 :** మావోయిస్టు అగ్ర నేత హిడ్మాను చంపి.. దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల అంశంపై చర్చించేందుకు గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లమని అన్నారు. అతన్ని తానే డీజీపీకి సరెండర్ చేయించేవాడిని అని పేర్కొన్నారు. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలు తెలుసుకోవాలని కూనంనేని సూచించారు. ఇలా చంపడం సరికాదని.. అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలని అన్నారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు తెలుస్తోందని.. అసలు పోలీసుల చెరలో ఎంతమంది ఉన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదేమైనా యుద్ధమా అని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపద కోసమే ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తుందని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా బండి సంజయ్ ఎన్‌కౌంటర్‌గా చెప్పడం దారుణమని మండిపడ్డారు. హింసను వీడి, శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

## నిజామాబాద్ టౌన్‌ప్లానింగ్‌లో ఏసీబీ సోదాలు

### పలు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి ఏసీబీ

**నిజామాబాద్, నవంబర్ 19 :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ భవనంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలలో తమ పనుల నిమిత్తం జనాలతో హడావిడిగా ఉన్న సమయంలో ఒక్కసారిగా ఏసీబీ అధికారులు వచ్చి నేరుగా టౌన్ ప్లానింగ్ కార్యాలయంలోకి వెళ్లారు. దీంతో ఏం జరిగిందోనని అధికారులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై పలు ఆరోపణలు రావడంతో ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు సిబ్బంది పై పలు ఫిర్యాదులు రావడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం.

## లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడు మృతి

**హైదరాబాద్, నవంబర్ 19 :** నగరంలోని ఎల్లారెడ్డిగూడలో విషాద ఘటన చోటుచేసుకుంది. కీర్తి అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడు మృతి చెందాడు. అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో నివాసం ఉండే నరుసు నాయుడు చిన్న కుమారుడు హర్షవర్ధన్ (5) మధురానగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి తల్లి, సోదరుడితో పాటు ఇంటికి వచ్చిన బాలుడు లిఫ్ట్‌లో అయిదో అంతస్తులోకి వెళ్లాడు. తిరిగి కిందికి దిగుతున్న క్రమంలో 4, 5 అంతస్తుల మధ్య లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే బాలుడిని బయటకు తీయగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మృతితో అపార్ట్‌మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి

## గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌కు 11 రోజుల ఎన్ఐఏ కస్టడీ

### ఢిల్లీలోని పాటియాలా హౌస్‌కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, నవంబర్ 19 :** ఎన్‌సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకేసుతో సహా పలు కేసుల్లో వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్ ను 11 రోజుల ఎన్ఐఏ కస్టడీకి ఢిల్లీలోని పాటియాలా హౌస్‌కోర్టు బుధవారంనాడు అప్పగించింది. అన్మోల్‌ను అమెరికా డిపోర్ట్ చేయడంతో అక్కడి నుంచి భారత్‌కు తరలించారు. అన్మోల్‌ను తీసుకువచ్చిన విమానం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం ల్యాండ్ అయిన వెంటనే అతన్ని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది. పాటియాలా హౌస్ కోర్టు ముందు హాజరుపరిచింది. బిష్ణోయ్ క్రైమ్ సిండికేట్‌లో అన్మోల్ పాత్రను ఎన్ఐఏ తరఫు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాహుల్ త్యాగి కోర్టుకు వివరించారు. ఈ నెట్‌వర్క్‌లో అన్మోల్ కీలక సభ్యుడని, 2022 నుంచి పరారీలో ఉన్నాడని, ప్రస్తుతం జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ నడుపుతున్న టెర్రర్ గ్యాంగ్‌స్టర్ సిండికేట్‌లో అరెస్టయిన 19వ నిందితుడని తెలిపారు. టెర్రర్ గ్రూప్ ఆపరేషన్లకు అందుతున్న నిధులు, ఇతర సభ్యులను గుర్తించడం సహా విస్తృత స్థాయి సమాచారం వెలికితీసేందుకు అన్మోల్‌ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాల్సి ఉంటుందని అన్నారు. కాగా, అన్మోల్‌పై రాజస్థాన్, పంజాబ్, మహారాష్ట్రలో 31 కేసులు నమోదయ్యాయి. ముంబైలో సంచలనం సృష్టించిన బాబా సిద్ధిఖీ హత్య కేసు నిందితులతో అన్మోల్ సంప్రదింపుల సాగించినట్టు ఎన్ఐఏ గుర్తించింది. 2022లో పంజాబీ గాయకుడు సిద్ధూమూసేవాలా హత్య కేసులోనూ అతను అభియోగాలను ఎదుర్కొంటున్నాడు. ఆయనపై రూ.10లక్షల రివార్డును కూడా ఎన్ఐఏ ప్రకటించింది. ఈ ఏడాది ప్రారంభంలో అమెరికాలో అన్మోల్ పట్టుబట్టాడు. ఈనెల 18న అతనిని యూఎస్ బహిష్కరించింది.

## నేడు బీహార్ సిఎంగా మరోమారు నితీశ్ ప్రమాణం

- పదోసారి ప్రమాణం చేయబోతున్న నితీశ్
- ఎన్‌డిఎ నేతగా ఏకగ్రీవంగా ఎంపిక..గవర్నర్‌కు రాజీనామా
- నేటి ప్రమాణోత్సవానికి మోడీ, అమిత్ షా తదితరుల హాజరు



**పాట్నా, నవంబర్ 19 :** బిహార్‌లో నితీశ్ కుమార్ సారథ్యంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం గురువారం కొలువు తీరనుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ముఖ్యమంత్రి పదవికి నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను సమర్పించారు. ఎన్డీయే సభ్యుల మద్దతు లేఖను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఇందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. నితీశ్ రాజీనామాను వెంటనే ఆమోదించారు. నితీశ్ వెంట గవర్నర్‌ను కలిసి వారిలో ఎల్‌జేపీఆర్‌వీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా బుధవారం ఉదయం నుంచి పాట్నాలో వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జేడీయూ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ లెసిస్లేచర్ పార్టీ నేతలు సైతం సమావేశమై పార్టీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం ఎన్డీయే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిలీప్ జైశ్వాల్, సామ్రాట్ చౌదరి, చిరాగ్ పాశ్వాన్, కేశవ్ ప్రసాద్ మౌర్య, విజయ్ కుమార్ సిన్హా, రాజు తివారి సహ ఎన్డీయేకు చెందిన 202 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ పేరును సామ్రాట్ చౌదరి ప్రతిపాదించగా, ఎమ్మెల్యేలంతా బలపరిచారు. దీంతో నితీశ్ 10వ సారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానంతరం నితీశ్ సారథ్యంలోని పలువురు నేతలు గవర్నర్‌ను కలుసుకున్నారు. మరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతున్నారు. దీంతో బిహార్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తదుపరి ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నీతీశ్‌ను ఎన్నుకున్నారు. జేడీయూ సుప్రీం నితీశ్ కుమార్ ఎన్డీయే (ఔఅం) నేతగా బుధవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన బిహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమమైంది. కొత్త మంత్రివర్గంలో బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తిరిగి ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగనున్నారు. ఈ మేరకు బీజేపీ ఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే 243 స్థానాల్లో 202 స్థానాలు గెలుచుకుని అఖండ విజయం సొంతం చేసుకుంది. ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుని బిహార్‌లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో 85 సీట్లతో ఆర్జేడీ నిలిచింది. ఎన్డీయే కూటమిలోని ఎల్‌జేపీఆర్‌వీ 19 సీట్లు, హెచ్ఏఎం 5, ఆర్ఎల్ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి.

## వచ్చే దసరా నాటికి ఉప్పల్ కారిడార్

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,నవంబర్ 19 :** ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2026 దసరా నాటికి కచ్చితంగా పూర్తిచేస్తామని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్అండ్‌బీ, నిర్మాణ సంస్థను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి.. వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ – వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప్పల్ – వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మేడారం జాతర ప్రారంభమయ్యే నాటికి బీటీ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం, రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు.

## ఇస్లాంలో బలిదానాన్ని తావులేదు

- ఉమర్‌ది ముమ్మాటికీ ఉగ్రవాదమే
- ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించిన ఓవైసీ

**హైదరాబాద్, నవంబర్ 19 :** ఎర్రకోటవద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఆత్మాహుతి దాడి గురించి ఉమర్ చేసిన వ్యాఖ్యలను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఢిల్లీ పేలుళ్ల నిందితుడు ఉమర్ నబీ ఆత్మాహుతి బాంబు దాడిని సమర్థిస్తున్న వీడియో ఒకటి ప్రచారంలో ఉంది. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. అయితే, ఇస్లాంలో ఆత్మహత్య, అమాయకులను చంపడం ఘోరమైన పాపం. ఇలాంటి చర్యలు దేశ చట్టాలకు కూడా పూర్తి విరుద్ధం. దీన్ని తప్పుగా అర్థం చేసుకోవడానికి ఏమీ లేదు. ఇది ముమ్మాటికే ఉగ్రవాదమే' అని ఒవైసీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. మరోవైపు దేశ రాజధాని సమీపంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం, ఢిల్లీ పేలుడుతో ముడిపడి ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌పై ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. 'గత ఆరు నెలల్లో స్థానిక కశ్మీరీలు ఎవరూ ఉగ్రవాద సంస్థల్లో చేరలేదని ఆపరేషన్ సిందూర్, మహదేవ్ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటుకు తెలిపారు. మరి ఈ గ్రూపు ఎక్కడి నుంచి వచ్చింది..?' అంటూ ఆయన నిలదీశారు. ప్రస్తుతం ఒవైసీ ట్వీట్ వైరల్ అవుతోంది. కశ్మీర్‌కు చెందిన కొందరు వైద్యుల మాటున ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్న సమయంలోనే ఈ నెల 10వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడు సంభవించింది. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ వద్ద కారులో పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 15 మంది మరణించారు. ఇక ఈ పేలుడుకు పాల్పడింది ఓ వైద్యుడిగా అధికారులు గుర్తించారు. ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వైద్యుడు ఉమర్ నబీగా గుర్తించారు. ఈ మేరకు అతడితో సంబంధం ఉన్న వ్యక్తులను దర్యాప్తు అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ విచారణలో ఉమర్ ఓ కరుడుగట్టిన ఉగ్రవాది అని తేలింది. ఉగ్ర దాడుల గురించి అతడు ఉద్వేగభరితంగా మాట్లాడేవాడని సన్నిహితులు తెలిపారు.

## పార్టీలో ఉంటూనే సొంతవారిపై పోస్టులు

- ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హెచ్చరిక



**హైదరాబాద్,నవంబర్ 19 :** పార్టీ కార్యకర్తలకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా సరే ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం అని హెచ్చరించారు. టైమ్ కూడా ఇవ్వం అని, అవసరం అయితే జైలుకు పంపిస్తాం అని కార్యకర్తలతో అన్నారు. కొందరు తాము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిత్వంను అస్సలు చంపుకోవద్దని సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సోషల్ మీడియా, లీగల్ సెల్ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడారు. 'పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇష్టమొచ్చినట్లు కామెంట్ చేస్తే సస్పెండ్ చేస్తాం, టైమ్ కూడా ఇవ్వం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఫేక్ అకౌంట్స్ ద్వారా బీజేపీపై పోస్టులు పెడుతున్నాయి. పార్టీ నేతలు ఒక మంత్రి దగ్గరకు వెళితే.. ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని రాశారు. ఆ పేపర్ మీద రూ.5 కోట్ల పరువు నష్టం దావా వేశాం. మేము బీజేపీ అంటూనే.. బీజేపీ నేతల మీదనే పోస్టింగ్‌లు పెడుతున్నారు. కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం. ఇప్పటికే కేసులు పెట్టాం. పార్టీ మీద ఎవరు పోస్టులు చేసినా కౌంటర్ ఇవ్వండి. బీజేపీ చిల్లర రాజకీయాలకు భయపడదు. దమ్ముంటే ముందుకు వచ్చి మాట్లాడండి' అని రామచందర్ రావు అన్నారు. 'డబ్బులిస్తే ఏది పడితే అది రాస్తున్నారు, మాట్లాడుతున్నారు. ఎవరిని ఉపేక్షించేది లేదు. యూట్యూబ్‌లో మాట్లాడుతున్నారు. ఒకరు దుబాయ్, మరొకరు అమెరికాలో ఉండి తిడుతున్నారు. మీరు ఇండియాకు రండి మీ సంగతి చెబుతాం. పార్టీ కార్యకర్తలను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ నేతలు ఎవరిని ప్రోత్సహించినా, వాటిని ఫార్వర్డ్ చేసినా సిరియస్ యాక్షన్ ఉంటుంది. నా మీద కూడా ఫేక్ వార్తలు వస్తాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వార్నింగ్ ఇస్తున్నా, మా మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయకండి. సోషల్ మీడియా, యూట్యూబ్ వారికి విజ్ఞప్తి చేస్తున్నాం.. మీ వ్యక్తిత్వంను చంపుకోవద్దని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కోరారు.

# కాలం గర్భంలోకి మావోయిస్ట్ పార్టీ!



**మావోయిస్టుల చరిత్ర ముగిసినట్లుగానే భావించాలి. ఉవ్వెత్తున ఎగిసిన పీపుల్స్‌వార్ ఇప్పుడు గతచరిత్రగా మిగిలిపోయింది. ప్రజలతో సంబంధాలు, ప్రజల సమస్యలపై పోరాటం ఉన్నంత వరకు వారు బలంగా ఉన్నారు. ప్రజల అండదండ ఉన్నంత వరకు ఉద్యమం బలంగా సాగింది. కానీ కేవలం అడవికే పరిమితమై, ప్రజలకు దూరమైన నేపథ్యంలో వారికి అండదండలు కరువయ్యాయి. కొండపల్లి సీతారామయ్య మొదలు, గణపతి వరకు పీపుల్స్‌వార్ ఉండగా బలమైన విప్లవపార్టీగా వెలుగొందింది. అలాగే గ్రామస్థాయిలో ప్రజల మన్ననలు పొందింది. ప్రజల సమస్యలపై నిలదీసేలా ఉద్యమాన్ని నిర్మించింది. రాజకీయ నాయకులు గ్రామాలకు వెళ్లాలంటేనే భయపడేలా చేసింది. భూకమందులు పారిపోయి పట్టణాలకు చేరారు. రైతులకు అండగా నిలిచారు. మొత్తంగా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడం, వారికి మేం అండగా ఉన్నామని చెప్పడం ద్వారా బలమైన విప్లవపార్టీగా నిలిచింది. కానీ ప్రజలతో దూరం అయినందున క్రమంగా పార్టీ బలహీనపడుతూ వచ్చింది.**

మావోయిస్ట్ పార్టీగా మారిన తరవాతనే దాని పతనం ప్రారంభమయ్యింది. గ్రామాల్లో మొదలు పట్టణాల్లో కూడా మావోలు దందాలు మొదలు పెట్టారు. కేవలం దందాలు చేసి బెదరించుకునే బ్యాచ్‌గా మారింది. పట్టణాల్లో మావో అగ్రనేతల విలాసాలు బయట పడ్డాయి. పోలీసులకు దొరికిపోయారు. కొందరు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలా ఆ పార్టీలో కల్చర్ మారింది. ప్రజల పక్షాన పోరాడాలన్న లక్ష్యం పోయింది. దీనికితోడు ప్రపంచం మారుతోంది. అడవుల్లో ఉండి పోరాడేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరు. ఎవరికి వారు తమ కెరీర్ కోసం చదువులను కొనసాగించారు. ఒకప్పుడు డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారు పీపుల్స్‌వార్‌కు ఆకర్శితులయ్యారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. సిద్దాంతాలకు ఆకర్శితమై పోరాడే వారు లేరు. ప్రజలు ఏదో పనిచేసుకుని బతికేందుకే సిద్దంగా ఉన్నారు. విదేశీ విద్య అందుబాటులోకి రావడంతో యువత విదేశాల బాట పట్టింది. ఇలా రిక్రూట్‌మెంట్లు ఆగిపోయాయి. ఉన్నవారు అడవులకు పరిమితం అయ్యారు. అలాగే పోలీస్ నిర్బంధం వల్ల పార్టీ విస్తరణ అన్నది లేకుండా పోయింది. మొత్తంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్‌గా ఉన్న పార్టీ క్రమేణా ప్రాభవం కోల్పోయి మావోయిస్ట్ పార్టీగా మరింత పతనం అయ్యింది. అగ్రనేతల దూరదృష్టి లోపం, విభేదాలు, లొంగుబాట్లు ఇలా అంతా కలసి నిర్వీర్యం అయ్యింది. దీనికితోడు పోలీస్ నిర్బంధం పెరిగింది. గతంలో కూడా నిర్బంధం ఉన్నా ప్రజలు తమ కడుపులో పెట్టుకుని దాచుకున్నారు. ఇకపోతే నమ్ముకున్న గిరిజనులను ఇన్‌ఫార్మర్ల పేరుతో మట్టుపెట్టారు. కితాతక హత్యలకు పాల్పడ్డారు. గొడ్డలితో నరికి వేయడం,కాళ్లూ చేతులు నరకడం వంటి కిరాతక చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు ఎంతగా హింసకు పాల్పడ్డారో అంతకు మించి అన్నట్లుగా నక్సల్స్ హింససాగించింది. వారి పతనావస్థకు ఇవన్నీ కారణాలుగానే చూడాలి. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్‌తో అగ్రనేతలంతా మట్టికరిచినట్లే. కొందరు లొంగిపోయారు. మరికొందరు నేలకొరిగారు. ఇటీవల మల్లోజుల తదితర అగ్రనేతలు లొంగిపోవడం కూడా ఎన్‌కౌంటర్ల నుంచి తప్పించు కునేందుకే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఇన్నేళ్ల సుదీర్ఘ పోరాటంలో మావోయిస్టులు సాధించిందేమీ లేదు. వేలాదిమందిని వారు పొట్టన పెట్టుకున్నారు. అలాగే వేలాదిమంది మావోలు కూడా మృత్యువాత పడ్డారు. చివరకు ఉద్యమపార్టీ సాధించింది సున్నా అనే చెప్పాలి.

మారేడిమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత హిడ్మాతో పాటు ఐదుగురు చనిపోయిన క్రమంలో ప్రతి ఒక్కరూ అవలోకన చేసుకోవాలి. అడవుల బాట పట్టిన మావోల కారణంగా ఎందరో జీవితాలు నాశనం అయ్యాయి. ఎందరో తమ వృత్తిని, చదువును వదిలి పోరాటంలో దూకడంతో కుటుంబాలను రోడ్డున పడేశారు. వందలాదిమంది తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారు. తాజాగా మారేడిమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్ కౌంటర్‌లో తప్పించుకున్న ఆరుగురు కూడా హతమయ్యారని అధికారులు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించాడని వస్తున్న సమాచారాన్ని పోలీసులు ఖండించారు. అయితే పోలీసులు పట్టుబట్టి అడవులను జల్లెడ పడుతున్నారు. దీంతో వారు తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. అందుకే పోలీస్ తూటాలకు నేలకొరగక తప్పడం లేదు. పీపుల్స్‌వార్ ఒక సిద్ధాంతం కోసం ఆవిర్భవించింది. ఒక నిబద్దతో పనిచేసింది. ప్రజల సమస్యలపై పోరాటం, రాజకీయ అవినీతిపై నిక్కచ్చిగా పోరాడింది. ప్రజలకు అండగా నిలిచింది. పెత్తందార్ల భరతం పట్టింది. అక్రమాలను నిలదీసింది. భూస్వామ్య విధానాలపై పోరాడింది. కానీ అవేవీ ఇప్పుడు నిలవలేదు. పీపుల్స్‌వార్ ఉన్నంత కాలం గ్రామస్థాయిలో కొంత భయం ఉండేది. ఎక్కడ వారికి తెలిస్తే తమను చంపేస్తారేమో అన్న భయం ఉండేది. అయితే ఇన్నేళ్ల పోరాటంలో ఏం సాధించా రన్నది ప్రశ్న. ఈ ప్రశ్న ప్రతి ఒక్కరూ వేసుకోవాలి. పాటలు, రెచ్చగట్టే ప్రసంగాలతో అప్పట్లో మావోల్లో చేరడానికి చాలామంది వచ్చేవారు. పశువుల కాపరులు కూడా దళాల్లో చేరారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రాజ్యం ఎప్పుడూ బలవంతమనైదని గుర్తించాలి. ప్రజల అండకూడా లేకపోవడంతో మావోల అణచివేత ప్రభుత్వాలకు సులువుగా మారింది. కాలానుగుణంగా టెక్నాలజీ మారింది.

యువత కెరీర్ కోసం దేశం విడిచి పోతున్నారు. చదువుకోకుండా మావోల్లో చేరేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరు. ఈ పరిణామాలన్నీ మావోలు బలహీనపడడానికి కారణం అయ్యాయి. వెరసి మావోయిస్టులను ఏరిపారేయడం ప్రభుత్వాలకు సులువుగా మారింది. ఇకపోతే ఆధునిక కాలంలో మారిన పరిస్థితుల్లో మావోల పాత్ర కూడా లేకుండా పోయింది. అందుకే క్రమేపీ వారి ప్రాబల్యం తగ్గడంతో పాటు, అంతర్థానానికి కారణమ-య్యింది. అందుకే వారి పోరాటాలకు ఆదరణ లేకుండా పోయింది. నిజానికి వారు పోరాడుతున్నది కూడా ఏమీ లేదు. అలాంటప్పుడు వారు అడవుల్లో ఇంకా ఉండడం దండగ. ఉన్నవారు లొంగిపోతే ప్రాణాలైనా దక్కుతాయి. అడవిలో ప్రశాంతత ఉంటుంది. సిద్దాంతలకు విలువ లేనప్పుడు అది ఏ పార్టీ అయినా పతనం కావాల్సిందే. రాజకీయ పార్టీ అయినా, పీపుల్స్ పార్టీ అయినా చరిత్రలో కనుమరుగు కావాల్సిందే. ఇప్పుడు అదే జరుగుతోంది.

# మారేడిమిల్లిలో మరో భారీ ఎన్‌కౌంటర్


- ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతం
- టెక్ శంకర్, నంబాల తదితరులు ఉన్నట్లు సమాచారం



**విశాఖపట్టణం, నవంబర్ 19 :** మారేడిమిల్లిలో బుధవారం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టు కీలక నేతలు హతమయ్యారు. వీరంతా హిడ్మా ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న వారేనని పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అలాగే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కమ్యూనికేషన్ టీం ఛీఫ్, సౌత్ జోనల్ కమిటీ మెంబర్ సురేష్ అలియాస్ రమేష్, ఏరియా కమిటీ సభ్యులు జాగరగొండ ఏరియా మిలిషియా కమాండర్ లోకేష్ అలియాస్ గణెలిష్ కూడా హతమయ్యారు. వీరితో పాటు జాగరగొండ డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు శ్రీను అలియాస్ వాసు.. జాగరగొండ డివిజనల్ కమిటీ, ఏరియా కమిటీ సభ్యురాలు అనిత, ఇదే కమిటీలో సభ్యురాలు షమ్మి ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు అధికారులు ధృవీకరించారు. వీరి తలలపై లక్షల రివార్డు ఉందని స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో చెబుతోంది. మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలోని ఐదు జిల్లాల్లో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలో ఐదు జిల్లాలో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. అంతేకాకుండా ఈరోజు కూడా ఏజెన్సీలో నక్సల్స్, పోలీసులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల సమయంలో ఏజెన్సీలో కాల్పులు జరిగాయని.. ఏడుగురు నక్సలైట్స్ చనిపోయారని తెలిపారు. వీరిలో నలుగురు పురుషులు, ముగ్గరు మహిళలు ఉన్నారన్నారు. వారిని పూర్తిగా గుర్తించాల్సి ఉందని చెప్పారు. మారేడుమిల్లిలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్ ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈఎన్‌కౌంటర్ జరిగినట్లు వెల్లడించారు. చనిపోయిన వారిలో జ్యోగారావు అలియాస్ టేక్ శంకర్ ఒక్కరినే గుర్తించామని తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన జ్యోగారావు పదేళ్లుగా మావోగా ఉన్నారని.. ఇతర సమాచారాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఏడీజీ తెలిపారు. డీజీ ఇంకా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీకి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిఘా వర్గాలు వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. నవంబరు 17న కీలకమైన ఆపరేషన్ చేపట్టామని.. నిన్న మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, మరో ఐదుగురు ఎన్ కౌంటర్‌లో చనిపోయినట్లు చెప్పారు. వాళ్ల నుంచి సేకరించిన సమాచారంతో ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారని దృష్టి పెట్టామని అడిషనల్ డీజీ వెల్లడించారు. ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎవరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. ÷ూష్ట్ర చరిత్రలో ఇంతమంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. కేంద్ర, రాష్ట్ర, ఏరియా, కమిటీ సభ్యులు, ప్లాటూన్ టీంలను పట్టుకున్నట్లు తెలిపారు. వారిని నుంచి వెపన్స్ 45, 272 రౌండ్స్, రెండు మ్యాగజైన్, 750 గ్రాముల వైర్, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ ఫీల్డ్ సిబ్బంది ప్రణాళిక ప్రకారం ఆపరేషన్ పూర్తి చేశారన్నారని.. ఇందులో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఇంటిలిజెన్స్ విభాగం ఈ విషయంలో బాగా పని చేసిందని కొనియాడారు. ముందే సమాచారం వచ్చినప్పటికీ వారిపై నిఘా పెట్టామని.. వారి ఆలోచనలు, కార్యకలాపాలను గమనించినట్లు వివరించారు. అన్నీ సెట్ చేసుకున్నాక ఒకేసారి వారందరినీ పట్టుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది ఇటీవల సరెండర్ అయ్యారని.. వాళ్ల ద్వారా సమాచారం వెళితే ఇబ్బందులు ఉంటాయని మావోలు భావించారన్నారు. అందుకే కొన్ని రోజులు షెల్టర్ తీసుకునేందుకు ఏపీలో పలు ప్రాంతాలను ఎంచుకున్నారనట్లు చెప్పుకొచ్చారు. మళ్లీ సమయం చూసి వాళ్ల ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని.. మావోల మూవ్‌మెంట్, ప్లాన్లపై ఇతర సమాచారం లేదన్నారు. హిడ్మాను పట్టుకున్నాక చంపామనే ప్రచారంలో నిజం లేదని అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా స్పష్టం చేశారు. మరోవైపు పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. భారీ భద్రత నడుమ మావోయిస్టులను ఏలూరు , కాకినాడ, కోనసీమ, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పోలీసులు తరలించారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. ఇప్పటికే 5 జిల్లాల ఎస్పీలు ,రేంజ్ ఐజీలు కమాండ్ రూమ్‌కు చేరుకున్నారు. మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న రైఫిల్స్, పిస్టల్స్, డిటోనేటర్లు, మ్యాజగైన్లు ,మొబైల్స్, సిమ్ కార్డులు,పెన్ డ్రైవ్‌లు, విప్లవ సాహిత్యం, హిడ్మా ఫొటోలను స్వాధీనం చేసుకుని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పోలీసులు తరలించారు. మరోవైపు మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడ వరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదన్నారు. జర్నలిస్టులకు హిడ్మా లేఖ రాయడం గురించి తెలియదు. హిడ్మా ఎదురుకాల్పుల్లోనే చనిపోయారు. ఆయన్ను పట్టుకున్నాక చంపారనే విషయంలో వాస్తవం లేదు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తున్నాం. మావోయిస్టుల ప్లాన్ ఏంటో, కానూరులో ఎందుకున్నారో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలో చాలా మంది లొంగిపోతారు. అరెస్టుల వల్ల భయపడాల్సిన అవసరం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు మావోయిస్టులు వెళ్తున్నారు.

# ఏటా ధాన్యం కొనుగోళ్లలో తకరారు

- రైతులకు సకాలంలో అందని భరోసా
- పండించిన పంటలు అమ్ముకోవడంలో తంటాలు



**హైదరాబాద్, నవంబర్ 19 :** ఏటా ధాన్యం కొనుగోళ్ల సమయంలో తకరారు తప్పడం లేదు. రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదు. మార్కెట్ కమిటీలు ఉత్సవవిగ్రహాలుగా మారాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఇప్పుడు రైతుల పక్షాన ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్, వైకాపాలు తమ హయాంలో లోపాల గురించి మాట్లాడడం లేదు. గతంలో రైతుల ఆందోళనలను తక్కువచేసారు. అందుకే ఎవరు అధికారంలో ఉన్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు. ఇకపోతే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. కొండంత లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం కొంటున్నది మాత్రం కొంతే. తేమ, తాలు, రంగుమారిందంటూ కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 40 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ ఇప్పటి వరకు కొనుగోలు చేసింది 15 లక్షల టన్నులు మాత్రమే. వానకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రణాళిక ప్రకారం అక్టోబర్‌లో 6.89 లక్షల టన్నులు, నవంబర్‌లో 32.95 లక్షల టన్నులు, డిసెంబర్‌లో 27.03 లక్షల టన్నులు, జనవరిలో 8.12 లక్షల టన్నులు కొనుగోలు చేయాలి. దీని ప్రకారం నవంబర్ నెలాఖరు వరకు 39.84 లక్షల టన్నుల కొనుగోలు చేయాలి. కానీ, 15 లక్షల టన్నులతో సరిపెట్టింది. ఇందులో దొడ్డు ధాన్యం 8 లక్షల టన్నులు కాగా సన్నధాన్యం 7 లక్షల టన్నులు ఉంది. వానకాలం సీజన్‌లో 65.96 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 159 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని సర్కారు అంచనా వేసింది. ఇందులో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకోసం సుమారు రూ. 20 వేల కోట్ల నిధులు అవసరం. సర్కారు వైఖరిని చూస్తుంటే కొనుగోళ్ల లక్ష్యం నెరవేరేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రారంభించి దాదాపు రెండు నెలలు కావొస్తున్నది. కానీ ఇప్పటికి మొత్తం కేంద్రాలు ప్రారంభించకపోవడం గమనార్హం. ఈ సీజన్‌లో మొత్తం 8,332 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు 7,300 కేంద్రాలను మాత్రమే ప్రారంభించింది. అంటే ఇంకా వెయ్యికి పైగా కేంద్రాలు ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. ల్గ÷తులు తమ ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామంటూ అధికారులు, అటు ప్రభుత్వ పెద్దలు గొప్పగా ప్రకటించారు. కానీ వారి ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. రైతులు తమ ధాన్యం విక్రయించి వారాలు గడుస్తున్నా డబ్బులు అందడం లేదు. ప్రస్తుతం రైతులకు రూ. 2 వేల కోట్లకు పైగా చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపుల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**తాజాగా తులంపై 100 పెరుగుదల**

**హైదరాబాద్, నవంబర్ 19 :** బంగారం ధరలు కొనుగోలుదారులకు మళ్లీ షాక్ ఇచ్చాయి. ధరలు తగ్గినట్టే తగ్గి మరోసారి పైకి కదిలాయి. మార్కెట్‌లో మంగళవారం ధర భారీగా దిగివచ్చినప్పటికీ తాజాగా బుధవారం మళ్లీ పెరిగింది. డిమాండ్ బలంగా ఉండడంతో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ధర పెరిగినట్లుగా ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.1500 పెరిగి తులానికి రూ.1,27,300కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1500 పెరిగి తులానికి రూ.1,26,700కి చేరుకుంది. అదే సమయంలో వెండి ధర సైతం భారీగానే పెరిగింది. రూ.4వేలు పెరిగి కిలోకు రూ.1.60లక్షలకు ఎగిసింది. దాంతో మూడురోజుల తర్వాత ధరలు బులియన్ మార్కెట్‌లో ధరల తగ్గుదలకు బ్రేక్ పడినట్లయ్యింది. యూఎస్ లేబర్ మార్కెట్‌లో బలహీనమైన సంకేతాలు వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచాయని విశ్లేషకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా స్పాట్ గోల్డ్ వరుసగా రెండో సెషన్‌లో పెరిగాయి. ఔన్స్‌కు 1.14 శాతం పెరిగి 4,114.01 డాలర్లకు చేరుకుంది. ఔన్సుకు వెండి ధర 3.09 శాతం 52.26 డాలర్లకు పెరిగింది. బుధవారం రాత్రి ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ అక్టోబర్ సమావేశం వివరాలు వెల్లడికానుండగా.. పెట్టుబడిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని.. దాంతో స్పాట్ గోల్డ్ 4,084 డాలర్ల కంటే ఎక్కువగా ట్రేడ్ అవుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల గోల్డ్ రూ.1,24,860 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,14,450 పలుకుతున్నది. ఇక కిలో వెండి రూ.1.76లక్షల వద్ద ట్రేడవుతున్నది.

## ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దేవద్దు

- భూముల జోలికి వస్తే ఖబర్దార్
- హెచ్చరించిన బల్మూర్ రైతులు

**నాగర్ కర్నూల్, నవంబర్ 19:** కాంగ్రెస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని బల్మూరు రైతులు ఆరోపించారు. భూముల జోలికి వస్తే ఖబర్దారని రైతులు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పంట బోనస్ ఇవ్వడానికి మొఖం లేదు కానీ రిజర్వాయర్ కడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఆలయం ఎదుట హామీలిచ్చి రిజర్వాయర్‌ను కట్టమని చెప్పినా నాయకులే నేడు రైతులకు అవసరం లేని రిజర్వాయర్ నిర్మించేందుకు బలవంతంగా భూములు లాక్కొవాలని చూస్తే సహించబోమని అన్నారు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ఇంజినీర్లను బతికించడానికి ప్రాజెక్టును కడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు జోలికి రావొద్దని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, రిజర్వాయర్ కోసం విలువైన మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామిక దేశంలో రాజరీక పాలన సాగదని హెచ్చరించారు.

## హిందూ మహిళలు మేల్కోవాలి

- ఆస్తులుంటే వీలునామా రాయండి
- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,నవంబర్ 19 :** దేశంలో హిందూ మహిళల ఆస్తులపై గత కొన్నేళ్లుగా వివాదాలు చోటుచేసుకుంటున్న వేళ సుప్రీంకోర్టు కీలక సూచన చేసింది. హిందూ మహిళ ఆస్తి కోసం పుట్టింటివారు, అత్తింటి వారు కోర్టు మెట్లు ఎక్కుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తిపై వివాదం లేకుండా ఉండాలంటే.. వారు బతికి ఉండగానే ఆస్తి ఎవరికి చెందాలనే విషయంలో స్పష్టంగా వీలునామా రాయాలని సూచించింది. మహిళకు పిల్లలు లేకపోతే ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆమె ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తుచేసింది. కానీ చాలా సందర్భాల్లో ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని పేర్కొంది. వివాహానంతరం మహిళ గోత్రం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ.. వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది. కానీ పిల్లలు లేని మహిళల ఆస్తుల విషయంలో, విడాకులు తీసుకోకుండా భర్తకు దూరంగా ఉంటున్న మహిళల ఆస్తుల విషయంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కారణంగా వారసత్వ హక్కుల్లో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రీ?లిటిగేషన్ మిడియేషన్ (మధ్యవర్తిత్వం) తప్పనిసరి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మధ్యవర్తిత్వంలో వచ్చే ఒప్పందాలను కోర్టు తీర్పు (డిక్రీ)గా పరిగణించాలని తెలిపింది. కొంతమంది న్యాయవాదులు ప్రస్తుత వారసత్వ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) వివక్షాత్మకమని అభిప్రాయపడుతున్నారని, దాన్ని మార్చాలంటే చట్టసవరణ చేయాలని, అది పార్లమెంట్ చేయాల్సిన పని మాత్రమేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది.

## రాష్ట్రంలో పెరుగుతున్న చలి తీవ్రత

**ఏజెన్సీలో మరింత పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, నవంబర్ 19 :** రాష్ట్రంలో చలిగాలుల తీవ్ర పెరుగుతోంది. దీనికితోడు రాత్రపూట చలి పెరిగింది. ఏజెన్సీ జిల్లాల్లో చలి పంజావిసురుతోంది. కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 నుంచి 27వరకు తెలంగాణ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. చలికి వర్షాలు తోడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలుంటాయని.. చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.



## శారీరక దృఢత్వానికి క్రీడలు దోహద పడతాయి

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల శ్రీ స్వామి నారాయన్ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన గో- 2025 గురుకుల్ ఒలంపిక్స్ ఆటల పోటీలను ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి. చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య యూనియన్ మాజీ మంత్రి వేణు గోపాల చారి, పల్ల గొల్ల అశోక్ యాదవ్. హైదరాబాద్లోని అతి పెద్ద, ప్రతిష్టాత్మకమైన ఇంటర్-స్కూల్ క్రీడల పోటీ, శ్రీ స్వామినారాయణ గురుకుల ఆధ్వర్యంలో జరుగుతుంది. ఈ వార్షిక క్రీడా మహోత్సవం విస్తృతమవుతూ, ఈ సంవత్సరం 153 పాఠశాలలు, 14,162 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ గురుకుల ట్రస్ట్ గత 77 సంవత్సరాలుగా దేశపు వారసత్వం, సంస్కృతి విలువలను కాపాడుతూ సేవలందిస్తున్న లాభాపేక్షలేని సంస్థ. దేశవ్యాప్తంగా అలాగే విదేశాల్లో 65 పైగా క్యాంపస్‌లలో, 1,25,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులను విద్య, నైతిక విలువలతో తీర్చిదిద్దుతోంది. భారత దేశంలో హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, విజయవాడ, విశాఖపట్నం, నాగ్‌పూర్, రాయ్‌పూర్, అహ్మదాబాద్, సూరత్ తో పాటు యుఎస్ఏ, యుకె, కెనడా, ఆస్ట్రేలియాలలో కూడా గురుకుల్ శాఖలు ఉన్నాయి. ఈ కార్యక్రమం లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, ఉపాధ్యాలుయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రచార జాతకు ఘనస్వాగతం పలకాలి

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఈనెల 24న కూసుమంచి వద్దకు చేరుకోనున్న ప్రచార జాతకు ఘన స్వాగతం పలకాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం కౌన్సిల్ సమావేశాన్ని గిరి ప్రసాద్ భవన్ లో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఉన్నం రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... సిపిఐ శతాబ్ది ఉత్సవాల విజయవంతానికై నల్లగొండ నుంచి బస్సు జాత ఖమ్మం నగరానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ జాతకు ఖమ్మం రూరల్ మండలంలోని సిపిఐ శాఖల నుంచి కామ్రేడ్స్ పెద్ద ఎత్తున తరలి వెళ్లి విజయవంతం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే విధంగా శతాబ్ది వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇది ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవంగా కొనియాడారు. సిపిఐ శ్రేణులు ఊరు, వాడలలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించి వేడుకకు కుటుంబ సభ్యులతో సహా కదలి రావాలని కోరారు. అనంతరం బస్సు జాత విజయవంతాని కై ముఖ్య నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, జిల్లా సమితి సభ్యులు పగిళ్ల వీరభద్రం, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

### యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రంజాన్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేపడుతున్న ఉపాధ్యాయులు దాచుకున్న నగదు చెల్లింపులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తుందని ఇది సరైంది కాదని అప్పు చేసైనా బకాయిలు చెల్లించాలని టిఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు రంజాన్ అన్నారు. నేలకొండపల్లి మండలం కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ 12 వ మండల మహాసభ మండల అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రం రెండేళ్లపాటు ఆలస్యంగా ఏర్పాటు చేసిన 8 వ వేతన సంఘం నియామకంలోని నిబంధనలతో పీఆర్సీ, డిఏ పెంపుదల వర్తించకపోవడం వల్ల పెన్షనర్ల పాలిట శాపంగా మారిందని తెలిపారు. దీనికి తోడు ఐటీ స్లాబులు సవరించాలని, టెట్ సమస్య పరిష్కారానికి విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23 సవరింపే మార్గమని, అందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఉన్నతాధికారులు అసంబద్ధమైన రేషనలైజేషన్, వర్క్ ఎడ్జస్ట్మెంట్, రివ్యూలతో ఉపాధ్యాయులని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. అదే విధంగా ఈ నెల 30 న కల్లూరులో జరగనున్న జిల్లా విస్తృత స్థాయి కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా టి.గురువయ్య, ఉపాధ్యక్షులుగా విజయ్ కుమార్, వెంకటరమణ, కోశాధికారిగా కోటేశ్వరరావు, సభ్యులుగా మురళి, అరుణ, ప్రతిమ, షరీఫ్, ఉపేందర్, శ్రీనివాస్, నవాబ్, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.





## బీజాపూర్ జాతీయ రహదారి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే యాదయ్య

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** బీజాపూర్-హైదరాబాద్ నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతిని స్వయంగా పరిశీలించిన చేవెళ్ల నియోజకవర్గ శాసన సభ్యులు కాలే యాదయ్య. రహదారి నాణ్యత, పని వేగం, కాంట్రాక్టర్ల సమన్వయం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి, పనుల్లో మరింత వేగం తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... ఈ హైవే పూర్తికావడం వల్ల చేవెళ్ల, వికారాబాద్, తాండూర్, పరిగి పరిసర ప్రాంతాల అభివృద్ధికి పెద్ద ఊతం లభిస్తుందని, ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి కావడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,

## రాణి రుద్రమాదేవి నేటి యువతరానికి స్ఫూర్తి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** రాణి రుద్రమదేవి నేటి యువతకు స్ఫూర్తి అని ఏబీవీపీ కార్యవర్గ సభ్యులు కురువ మైపాల్ అన్నారు. బుధవారం రోజు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) చేవెళ్ల శాఖ ఆధ్వర్యంలో 'స్త్రీ శక్తి దివస్' ను కృష్ణవేణి హై స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ మాట్లాడుతూ....భారత వీరనారి, అసమాన ధైర్యసాహసాల ప్రతీక రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం, ఆమె నాయకత్వం, త్యాగం, మాతృభూమి పట్ల ఉన్న అపార భక్తిని స్మరించుకున్నారు. అమ్మాయిలలో ఉన్న ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ గుణాలను వెలికితీయడం సమాజం బాధ్యతగా పేర్కొన్నారు. ప్రతి అమ్మాయి. రుద్రమాదేవిలా ముందడుగు వేస్తే, అణచివేత, వివక్ష, అన్యాయం అన్నీ తుడిచిపెట్టుకుపోతాయని తెలిపారు. భారతదేశం ఎందరో వీరులను, వీరమాతలను ప్రసవించిన పవిత్ర భూమి అని, ఆ గౌరవనీయులలో రాణి ఝాన్సీ లక్ష్మీబాయి అత్యున్నత స్థానంలో నిలిచిన వీరనారి అని పేర్కొన్నారు. 1857 స్వాతంత్ర్య సమరంలో ఆమె పోషించిన పాత్ర, బ్రిటిష్ అణచివేతకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన త్యాగం నేటి యువతకు శాశ్వత స్ఫూర్తి అన్నారు. రాణి



లక్ష్మీబాయి ధైర్యం, నాయకత్వం, దేశభక్తి ప్రతి భారత యువతి, యువకుడు ఆకళింపు చేసుకోవాల్సిన విలువలు అని, స్వీయ బలం, స్వీయ రక్షణ, సమాజ సేవ పట్ల అవగాహన పెంపొందించడం స్త్రీ శక్తి దివస్ యొక్క ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. భారత సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అపురూపమైందని, రుద్రమదేవి, చెన్నమ్మ, అహల్యాబాయి హోల్కర్, రాణి దుర్గావతి వంటి వీరనారులను స్మరించుకుంటూ మహిళా శక్తి అపారమని అమ్మాయిలు రుద్రమాదేవిలా ఎదిగితే అణచివేత కు ఎక్కడ చోటు వుండదు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి హారిక, అనిల్, హరికృష్ణ, మణిదీప్, శివ, పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతికి పాటుపడిన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ

### ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** నేటి యువత ఇందిరాగాంధీ నీ ఆదర్శంగా తీసుకోవాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అన్నారు. మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి సూర్యాపేట జిల్లా కేంద్రంలోగల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నిర్వహించారు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధి తీవ్రవాదుల తూటాలకు బలై, దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని తెలిపారు. పేదరిక నిర్మూలన కోసం గరిబి హటావో నినాదం తీసుకువచ్చారని, దేశంలో పంటల ఉత్పత్తి పెంచడం కోసం హరిత విప్లవం, ఉద్యోగాల కల్పన కోసం పరిశ్రమల స్థాపన, బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణలు వంటి అనేక పథకాలు తీసుకొచ్చారని అన్నారు. బంగ్లాదేశ్ విముక్తి కోసం పాకిస్తాన్ తో యుద్ధం చేసిన ధీర వనిత, ఉక్కుమహిళ ఇందిరాగాంధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, పట్టణ



అధ్యక్షులు అంజద్ అలి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరన్న నాయక్, దండుమైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చింతమల్ల రమేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, నాయకులు నాగుల వాసు, పందిరి మల్లేష్, కుందమల్ల శేఖర్, రావుల రాంబాబు, ఆలేటి మాణిక్యం, తన్వీర్, గండూరి రమేష్, సిరివెళ్ల శబరినాథ్, పంతంగి దశరథ, అన్నమయ్య రాము, బొజ్జ సంజయ్, ఉట్కూరు దివ్య, కనుకు వెంకన్న, సాజిద్, ఆయుబ్ ఖాన్, దైదా రవి తదితరులు పాల్గొన్నారు.

## మా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- అక్రిడేషన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి
- మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డిలకు టియుడబ్ల్యూజే జిల్లా శాఖ విన్నపం



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు విన్నపించిన టియూ డబ్ల్యూ జె, ఐజెయూ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీం పాషా లు కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు, ఇళ్ల స్థలాల మంజూరు చేయాలనీ టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా ల నేతృత్వంలో బుధవారం మణికొండలో మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లకు విన్నపించారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నో సంవత్సరాలుగా అంకిత భావంతో పని చేస్తున్న జర్నలిస్టులు సామాజిక సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, అత్యవసర పరిస్థితులు వంటి అంశాలను ఎల్లప్పుడూ ముందుండి ప్రజలకు చేరవేస్తున్నారని, ప్రజలతో ప్రభుత్వం మధ్య వారధి పాత్రను భాద్యతగా నిర్వహిస్తున్నారన్నారు. అయితే, జిల్లా అంతట పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు హెల్త్ కార్డులు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు ( అక్రిడేషన్ కార్డులు ), నూతనంగా రాకపోవటంతో, ఇళ్ల స్థలాలు/హౌసింగ్ ప్లాట్లు వంటి మౌలిక ప్రయోజనాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి వివరించారు. జిల్లాలో ఇప్పటికే పలువురు జర్నలిస్ట్ లు సరైన వైద్య సదుపాయాలు అందకా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్త్ కార్డులతో పాటు, భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యత వహిస్తున్న జర్నలిస్టులు కూడా సామాజిక భద్రత, వైద్య సౌకర్యాలు మరియు స్థిరమైన నివాసం వంటి మౌలిక సదుపాయాలు పొందాల్సిన అవసరం చాలా కాలంగా ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారించాలని కోరారు. హెల్త్ కార్డ్ పని చేయక పోవడం వలన రిపోర్టర్స్ ఇబ్బంది పడుతున్నారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ వి6 రిపోర్టర్ నర్సింగ్ రావు గుండె పోటుకు గురై స్టార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, తక్షణం ఆదుకోవాలని కోరారు. అదేవిదంగా ఉద్యోగుల మాదిరిగా అందరికీ హెల్త్ కార్డ్ అమలు అయ్యేలా చూడాలని విన్నపించారు. ఇటీవలే షాబాద్ మండలానికి చెందిన రిపోర్టర్ రాములు గుండె పోటుతో మృతి చెందారని, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సీనియర్ నేతలు సూర్యనారాయణ, రాజేందర్ రెడ్డి, రాజు, విష్ణు, రాము, శేఖర్ రెడ్డి, నరేందర్, బాలు, లక్ష్మినారాయణ, ఎం విజయ్, తదితరులు ఉన్నారు.



## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** గరిభి హటావో దేశ్ బచావో నినాదంతో భారతదేశంలోని పేదలకు కనీస అవసరాలైన కూడు, గూడు కల్పించిన మహనీయురాలు ఇందిరా గాంధీ అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ హఫీజుద్దీన్ అన్నారు. కూసుమంచి మండలం కేంద్రంలోని మిని గాంధీ భవన్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం దివంగత ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత తొలి మహిళ ప్రధానిగా అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టి పేదల అభ్యున్నతికి కృషి చేసిన ధీర వనిత అని కొనియాడారు. రాజ భరణాలు రద్దు చేసి బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాకే దక్కిందన్నారు. ఉక్కు మహిళగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివని, ఆమె ఆశయాలు కొనసాగాలంటే రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హఫీజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కార్యాలయం ఇంచార్జి భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు నాయకులు ఎడవెల్లి రామిరెడ్డి, బజ్జూరి వెంకట్ రెడ్డి, భారీ వీరభద్రం, బెల్లంకొండ వెంకన్న, కిరణ్, గుండా లింగారెడ్డి, బుచ్చిరెడ్డి, భూపాల్ రెడ్డి, చాట్ల పరశురామ్, కణతాల పాల్గొన్నారు.



## ప్రమాద బీమా చెక్కు అందజేత

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ జీవిత బీమా పథకాల ప్రయోజనాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకి అందించడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కీలకపాత్ర పోషిస్తోందని సీనియర్ మేనేజర్ కమతం వీరబాబు అన్నారు. నేలకొండపల్లి మండలంలోని రాయగూడెం గ్రామానికి చెందిన రేపాల నాజర్ ఇటీవల మరణించారు. నాజర్ గతంలో చెరువుమాధారం శాఖ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో పిఎంజేజేబివై(ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన) ప్రమాద భీమా పాలసీని కలిగియున్నాడు. దీంతో మరణాంతరం మంజూరైన రెండు లక్షల రూపాయల భీమా చెక్కును నామినిగా ఉన్న భార్య ఉమా కి బుధవారం మాజీ ఎంపీపీ కోరుకుంట్ల నాగేశ్వరరావుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ కుటుంబ సభ్యుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని ప్రతి బ్యాంక్ ఖాతాదారుడు తప్పనిసరిగా ఆరోగ్య, జీవన్ జ్యోతి ప్రమాద భీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ పొన్నవిల్లి నారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ తేజ, ఇరగ దిండ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## రామచంద్రు మరణం తీరని లోటు

### తెలుగుదేశం పార్టీ పాలేరు నియోజకవర్గ బాధ్యులు కరుణాకర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి రామచంద్రు మరణం పార్టీకి తీరని లోటని పాలేరు నియోజకవర్గ బాధ్యులు కొండబాల కరుణాకర్ తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు గ్రామ శాఖ అధ్యక్షులు గొర్రెపాటి క్రిష్ణమోహన్ తండ్రి రామచంద్రు బుధవారం వయోభారంతో వారి స్వగృహంలో కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న కరుణాకర్ పార్టీ శ్రేణులతో కలిసి రామచంద్రు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుమారుడు కృష్ణ మోహన్ ను పరామర్శించి, ఓదార్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం నుండి క్రమశిక్షణ కలిగిన క్రియాశీలక కార్యకర్తగా పార్టీలో కొనసాగుతూ ఈ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు నామా ప్రసాద్, ఉపాధ్యక్షులు కొలిశెట్టి భిక్షం, తెలుగు యువత నాయకులు మల్లెంపాటి లహరిన్, దాసరి జనార్ధన్, గొర్రెపాటి సైదులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## హసీనా అప్పగింతపై ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించనున్న బంగ్లాదేశ్

**ఢాకా, నవంబర్ 19 :** మానవత్వాన్ని మరచి తీవ్ర నేరాలకు పాల్పడ్డారన్న కేసులో మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం మరణశిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమెను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ భారత్ విముఖత చూపిస్తోంది. దీంతో ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనా, బంగ్లా మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌ల అప్పగింతపై ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించాలని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అక్కడి విదేశాంగ శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మీడియా సంస్థలు వెల్లడించాయి. దేశం విడిచి పారిపోయిన హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లపై రెడ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను అభ్యర్థించడానికి బంగ్లా ప్రాసిక్యూటర్ గాజీ తమీమ్ సన్నాహాలు చేపట్టారని బంగ్లాదేశ్ దినపత్రిక ది ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులపై రెడ్ నోటీసులు జారీ చేయాలని కోరుతూ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఇంటర్‌పోల్‌కు అరెస్ట్ వారెంట్‌తో పాటు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపింది. బంగ్లా నుంచి పారిపోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనాను తమకు అప్పగించాల్సిందిగా మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం.. భారత ప్రభుత్వాన్ని ఇప్పటికే పలుమార్లు కోరింది. ఆమె దేశం విడిచి పారిపోయిన నిందితురాలని, అందుకే ఆమెకు బంగ్లాదేశ్ అంతర్జాతీయ ట్రైబ్యునల్ మరణ దండన విధించిందని పేర్కొంటూ ఆమెను తమకు అప్పగించాలని ఆ దేశ విదేశాంగశాఖ ఒత్తిడి తెస్తోంది. అయితే.. హసీనాపై వచ్చిన అభియోగాలు రాజకీయంగా చేసినవే తప్ప వాటిలో వాస్తవం లేదని భావిస్తున్న భారత్.. ఆమెను ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి అప్పగించదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




## సిడ్నీలో రోడ్డు ప్రమాదం..

### భారత్‌కు చెందిన 8 నెలల గర్భిణి మృతి

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో భారత్‌కు చెందిన ఓ మహిళ మృతి చెందారు. మృతురాలు 8 నెలల గర్భిణి కావడం మరింత విషాదకరం. గత వారాంతంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌కు చెందిన 33 ఏళ్ల సమన్విత ధారేశ్వర్ కుటుంబం హార్న్స్‌బై ప్రాంతంలో నివాసముంటోంది. 8 నెలల గర్భిణి అయిన సమన్విత తన భర్త, మూడేళ్ల కుమారుడితో కలిసి సమీపంలోని పార్క్ వద్దకు వాకింగ్‌కు వెళ్లారు. ఈ క్రమంలోనే ఫుట్‌క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన సమన్వితను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గర్భస్థ శిశువు ప్రాణాలు కూడా దక్కలేదని తెలిపారు. మరికొన్ని వారాల్లో డెలివరీ కావాల్సిఉండగా.. ఈ లోగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సమన్విత భర్త కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రమాదానికి కారణమైన బీఎండబ్ల్యూ కారును నడిపింది 19 ఏళ్ల ఆరోన్ పపాజోగ్లుగా గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలు సమన్విత స్థానికంగా ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో టెస్ట్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.




## పట్టపగలే చోరీ..

### పన్ను అధికారులంటూ రూ.7కోట్లతో పరారీ

**బెంగళూరు :** పట్టపగలే నడిరోడ్డుపై భారీ దొంగతనం జరిగింది. పన్ను అధికారులమంటూ వచ్చిన దుండగులు ఏడు కోట్ల రూపాయలతో పరారీ అయ్యారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బెంగళూరులోని జేపీ నగర్‌లో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంక్ బ్రాంచ్ నుంచి క్యాష్ వ్యాన్‌లో ఏటీఎంకు నగదు తరలిస్తున్నారు. ఆ వ్యాన్ అశోకా పిల్లర్ ప్రాంతంలో ఉండగా.. అకస్మాత్తుగా ఒక కారు అడ్డుగా వచ్చింది. అందులో వ్యక్తులు నగదు ఉన్న వాహనం వద్దకు వచ్చి.. పన్ను విభాగ అధికారులమని, పత్రాలు చూపించాలని హడావుడి చేశారు. వ్యాన్ సిబ్బంది స్పందించేలోపే.. వారిని, డబ్బును కారులోకి బలవంతంగా ఎక్కించారు. కొంతదూరం కారుపోనిచ్చి, ఆ సిబ్బందిని బలవంతంగా దింపేశారు. తర్వాత ఆ డబ్బుతో పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపడుతున్నాయి. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నాయి. కరడుగట్టిన దోపిడీ ముఠాలు దీనివెనక ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

# బంగ్లా న్యాయప్రక్రియ సక్రమంగా లేదు

### హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్



**ఢాకా, నవంబర్ 19 :** బంగ్లా న్యాయ పక్రియను బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ తీవ్రంగా వ్యతిరేకించారు. తన తల్లి పట్ల బంగ్లా సర్కారు సరైన రీతిలో ప్రవర్తించడం లేదన్నారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జోయ్ మీడియాతో మాట్లాడారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనాను అప్పగించాలని ఇటీవల బంగ్లాదేశ్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో హసీనా కుమారుడు సాజీబ్ మాట్లాడుతూ బంగ్లా న్యాయ పక్రియను ఆయన వ్యతిరేకించారు. తన తల్లి పట్ల బంగ్లా సర్కారు సరైన రీతిలో ప్రవర్తించడం లేదన్నారు. సరిహద్దు వెంట ఉగ్రవాదం పెరుగుతున్నట్లు కూడా సాజీద్ భారత్‌ను హెచ్చరించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్ తన తల్లికి ఆశ్రయం కల్పించినందుకు ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే తన మాతృమూర్తిని చంపేందుకు మిలిటెంట్లు ఎలాన్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. షేక్ హసీనా అప్పగింతపై వచ్చిన అభ్యర్థనను వాజిద్ తిరస్కరించారు. తప్పుడు రీతిలో తన తల్లిపై కేసులు పెట్టారని ఆయన ఆరోపించారు. సుమారు 17 మంది జడ్జీలను తొలగించి విచారణ కొనసాగించారని, పార్లమెంట్ ఆమోదం లేకుండానే చట్టాలను సవరించారని, డిఫెన్స్ అటార్నీలను కోర్టుకు రానివ్వలేదని అన్నారు. అప్పగింత కోసం బంగ్లాదేశ్ చేసిన రిక్వెస్టు భారతీయ అధికారులు తిరస్కరిస్తారని భావిస్తున్నట్లు చెప్పారు. మా అమ్మ ప్రాణాలను భారత్ రక్షించిందని, ఒకవేళ ఆమె బంగ్లాదేశ్‌ను వీడిచిపెట్ట కుంటే, మిలిటెంట్లు ఆమెను చంపేవాళ్లు అని అన్నారు. హసీ నా ప్రభుత్వం సమయంలో అరెస్టు చేసిన వేల మంది ఉగ్రవాదులను యూనుస్ ప్రభుత్వం రిలీజ్ చేసినట్లు ఆరోపించా రు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం లష్కరే తోయిబా స్వేచ్ఛగా ఆపరేట్ చేస్తున్నట్లు చెప్పారు. బంగ్లా ఉగ్రవాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోందన్నారు.

## జర్నలిస్టు ఖషోగ్గి హత్యపై ప్రశ్న

### రిపోర్టర్‌పై మండిపడిన ట్రంప్



**సౌదీ :** సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) దాదాపు ఏడేళ్ల తర్వాత అమెరికాలో పర్యటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఏబీసీ ఛానల్‌కు చెందిన ఓ రిపోర్టర్ జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్యపై ప్రశ్నించగా.. ట్రంప్ ఆమెపై మండిపడ్డారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి హత్యకు గురయ్యారు. దీని వెనక ఎంబీఎస్ హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం కూడా వెల్లడించింది. ఈ హత్యపై తాజాగా ఏబీసీ జర్నలిస్టు ప్రశ్నించగా.. అమెరికా నిఘా ఆరోపణలను కూడా తోసిపుచ్చుతూ ట్రంప్ క్రౌన్ ప్రిన్స్‌ను సమర్థించారు. 'మీరు మాట్లాడుతున్న ఆ పెద్దమనిషి చాలామందికి నచ్చలేదు. మీకు నచ్చినా.. నచ్చకపోయినా అది జరిగిపోయింది. క్రౌన్ ప్రిన్స్‌కు దానిగురించి ఏమీ తెలియదు. మనం దాన్ని అలాగే వదిలేయాలి. ఇలాంటి ప్రశ్నలు అడిగి మీరు అతిథిని ఇబ్బంది పెట్టాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఆయన రిపోర్టర్‌పై మండిపడ్డారు. ఆ ఛానల్‌కు సంబంధించి యూఎస్ లైసెన్స్‌ను రద్దు చేయాలన్నారు. మీవి నకిలీ వార్తలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇదే ప్రశ్నకు ఎంబీఎస్ స్పందిస్తూ ఖషోగ్గి హత్య చాలా బాధాకరమైనదన్నారు. ట్రంప్ మొదటి పదవీకాలంలో జరిగిన ఖషోగ్గి హత్య సౌదీ–అమెరికాల మధ్య దౌత్య సంక్షోభానికి దారితీసింది. ప్రస్తుతం సౌదీతో తన సంబంధాలను పెంచుకునేందుకు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంబీఎస్ పర్యటన నేపథ్యంలో అమెరికాతో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. యూఎస్‌లో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాటు ఎఫ్–35 ఫైటర్ జెట్‌లను సౌదీకి విక్రయించనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఎంబీఎస్ పర్యటన నేపథ్యంలో ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ విందును ఏర్పాటు చేశారు. ఇందులో ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో కూడా పాల్గొన్నారు. ఈ క్రమంలో ట్రంప్ మాట్లాడుతూ తన చిన్న కుమారుడు బారన్ ట్రంప్.. రొనాల్డోకు పెద్ద అభిమాని అని తెలిపారు.

## ఓట్ చోరీ అంటూ ఈసీపై విమర్శలు

### రాహుల్‌కు 272 మంది ప్రముఖుల లేఖ



**న్యూఢిల్లీ :** 'ఓటు చోరీ' ప్రచారంలో భాగంగా.. కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పలుమార్లు తీవ్ర ఆరోపణలు చేశారు. తాజాగా ఆయన విధానాలను విమర్శిస్తూ.. 272 మంది ప్రముఖులు రాహుల్‌కు లేఖ రాశారు. ఇది రాజకీయ అసంతృప్తిని వెళ్లగక్కేవిధంగా ఉందని ఆ లేఖల్లో అభివర్ణించారు. భారత ప్రజాస్వామ్యం, దాని పునాది సంస్థలపై దాడి జరుగుతుండటంపై ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. విధానపరమైన ప్రత్యామ్నాయాలను తీసుకురావడానికి బదులుగా.. వారి రాజకీయ వ్యూహాల కోసం ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందంటూ రాహుల్ చేసిన వాదనలను ప్రస్తావించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేసినందుకు, ప్రభుత్వ ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడినందుకు రాహుల్‌పై ఎలాంటి అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదనే విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిపక్ష నాయకుడు ఎన్నికల కమిషన్‌పై పదేపదే దాడి చేస్తూ ఓటు చోరీకి సంబంధించి తన వద్ద అణుబాంబు లాంటి ఆధారాలు ఉన్నాయంటూ.. నమ్మశక్యం కాని అసభ్యకరమైన వాక్చాతుర్యాన్ని ఉపయోగించారని మండిపడ్డారు. ఈసీలో కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వ్యక్తుల వరకు ఎవరినీ వదిలిపెట్టబోనని బెదిరింపులకు పాల్పడటాన్ని తప్పుబట్టారు. ఈసీ నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను విమర్శించడాన్ని ఖండించారు. ఎస్‌ఐఆర్ గురించి ఈసీ ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చిందని, సుప్రీం కోర్టు కూడా దీనిపై మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ప్రక్రి యలో అనర్హులను తొలగించి.. కొత్తగా అర్హత కలిగిన ఓటర్లను చేర్చడం మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు రాజకీయాలపై అతనికున్న అసంతృప్తిని కప్పిపుచ్చుకునే ప్రయత్నంగా కన్పిస్తోందని అభిప్రాయపడ్డారు. 'ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వస్తే.. ఈసీపై ఎలాంటి ఆరోపణలు చేయరు. అదే ఫలితాలు ప్రతిపక్ష పార్టీలకు అనుకూలంగా లేకపోతే.. ఈసీని విలన్‌గా చిత్రీకరిస్తున్నారు. వారి ఆరోపణలు అవకాశవాదంగా కన్పిస్తున్నాయి' అని ఆరోపించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు రాజ్యాంగ ప్రక్రియను గౌరవించాలని కోరారు. నిరాధారమైన ఆరోపణలతో కాకుండా.. విధాన ప్రకటనలతో పోటీపడాలని, ప్రజాస్వామ్య తీర్పులను అంగీకరించాలని అభ్యర్థించారు.



## బిహార్ ఎన్డీయే శాసనసభాపక్షనేతగా నీతీశ్ కుమార్

**బిహార్ :** బిహార్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తదుపరి ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నీతీశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కలిసి రాజీనామా సమర్పించారు. ఇందుకు గవర్నర్ కూడా ఆమోదం తెలిపారు. దీంతో నవంబర్ 20న రాష్ట్ర ముఖ్యమంత్రిగా నీతీశ్ పదోసారి ప్రమాణం చేసేందుకు సిద్ధమయ్యారు. పట్నాలోని గాంధీ మైదాన్ వేదికగా నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్‌లతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా భాజపా నేత ప్రేమ్ కుమార్, డిప్యూటీ స్పీకర్ పదవి జేడీయూ అభ్యర్థికి ఇచ్చేందుకు ఎన్డీయే పక్షాలనడుమ అంగీకారం కుదిరినట్లు తెలిసింది. మంత్రివర్గానికి సంబంధించి ఎన్డీయే కూటమిలో మధ్య ఇప్పటికే ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ పదవుల కోసం నేతలు ముమ్మర లాబీయింగ్ కొనసాగిస్తున్నట్లు సమాచారం. భాజపా నేతలు సామ్రాట్ చౌదరీ, విజయ్ సిన్హాలు ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. నూతన కేబినెట్‌లో ఐదు నుంచి ఆరు కొత్త ముఖాలు చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. జేడీయూ నుంచి ప్రస్తుత మంత్రులే కొనసాగనుండగా.. భాజపాలో మాత్రం కొత్తవారికి చోటు దక్కనున్నట్లు తెలిసింది. వీరితోపాటు ఇతర భాగస్వామ్య పక్షాలకు మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



## పాక్ ప్రభుత్వమే ఉగ్ర దాడులు చేయిస్తోంది

### ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ సీఎం ఆరోపణలు

**పాకిస్తాన్ :** ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది.. పాకిస్థాన్ ప్రభుత్వంపై కీలక ఆరోపణలు చేశారు. రాజకీయ అజెండాలో భాగంగానే నకిలీ ఉగ్ర దాడులు చేయిస్తోందన్నారు. అఫ్రిది పేర్కొన్నట్లుగా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వాటి ప్రకారం.. గత నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అఫ్రిది పాక్ ప్రభుత్వం ఖైబర్ ప్రాంతంలో ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాద సంఘటనలను సృష్టిస్తోందని ఆరోపించారు. నిజమైన శాంతి ప్రయత్నాలను అడ్డుకుంటుందన్నారు. ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైన పష్తూన్ తహాఫుజ్ మూమెంట్ (పీటీఎం) సభ్యులు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. దీన్ని అఫ్రిది తీవ్రంగా ఖండించారు. శాంతి మార్గాలను పక్కదారి పట్టించడంతో పాటు అఫ్గానిస్థాన్‌తో తమ ప్రావిన్స్‌కు మధ్య ఏర్పడిన సంబంధాలను అడ్డుకునేందుకు ఇస్లామాబాద్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నంగా దీన్ని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ నాయకుడు, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌లాగానే తాను తలవంచనన్నారు. శాంతి ప్రయత్నాలకు భంగం కలిగించేవారిని ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తామని హెచ్చరించారు. పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో కొనసాగుతున్న సైనిక కార్యకలాపాలను ఆయన విమర్శించారు. సాయుధ దళాలు ఉగ్రవాద ఏరివేత పేరుతో పౌరులను లక్ష్యంగా చేసుకొని నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారు దీన్ని ఉగ్రవాదంపై యుద్ధంగా పేర్కొంటున్నారని.. కానీ, సొంత ప్రజలనే చంపుతున్నారని మండిపడ్డారు. ఇటీవల పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని తిరా లోయలోని పాక్ వైమానిక దాడులు చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో అనేకమంది మహిళలు, చిన్నారులతో సహా 30 మంది ప్రాణాలు కోల్పోయారు. సైనిక కార్యకలాపాలను సమర్థించుకునేందుకు ఇస్లామాబాద్ సరిహద్దు ప్రాంతాల్లో దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు.



## కాలుష్య కోరల్లో ఢిల్లీ

### క్రీడా పోటీలపై 'సుప్రీం' కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం సమస్య తీవ్రమైంది. శీతాకాలం కావడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ నేపథ్యంలో.. పాఠశాలల స్పోర్ట్స్, అథ్లెటిక్స్ కార్యక్రమాలను వాయిదా వేసేలా ఆదేశించడాన్ని పరిశీలించాలని 'వాయునాణ్యత నిర్వహణ కమిషన్'కు సుప్రీం కోర్టు సూచించింది. దిల్లీ–ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యంపై దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. నవంబరు, డిసెంబరు నెలల్లో అండర్–16, అండర్–14 విద్యార్థులకు ఇంటర్ జోనల్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు దిల్లీ ప్రభుత్వం సిద్ధమైనట్లు సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. కాలుష్యం గరిష్ఠ స్థాయిలో ఉండే ఈ నెలల్లో ఇటువంటి ఈవెంట్స్‌కు అనుమతించడం.. స్కూల్ పిల్లలను గ్యాస్ ఛాంబర్‌లో ఉంచడంతో సమానమేనని వాదించారు. ఈ సమయంలో బహిరంగ క్రీడా కార్యకలాపాలు నిర్వహించడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. వాయు కాలుష్యం తక్కువగా ఉండే నెలల్లో క్రీడాపోటీలు నిర్వహించేలా స్కూళ్లను ఆదేశించాలని 'సీఏక్యూఎం'కు సూచించింది. దిల్లీ–ఎన్‌సీఆర్‌లో వాయు కాలుష్యం మరింత పెరగకుండా నిరోధించేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈ సంస్థను ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే.

## కశ్మీర్ నెంబర్‌ప్లేట్ ఉన్న కారులో వెళ్లాలన్నా భయపడతా

### ఒమర్ అబ్దుల్లా

**న్యూఢిల్లీ :** దిల్లీ పేలుడు ఘటన అనంతరం కశ్మీరీలను అందరూ అనుమానంగా చూస్తుండడంపై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది చేసిన తప్పులకు కశ్మీరీలందరినీ బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఉగ్రకుట్రలకు తమను ఎక్కడ బాధ్యులను చేస్తారేమో అనే భయంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కూడా కశ్మీర్ ప్రజలు భయపడుతున్నారన్నారు. దిల్లీలో జరిగిన పేలుడుకు కశ్మీర్‌లోని కొందరు బాధ్యులు కావడం వల్ల మొత్తం కశ్మీర్ ప్రజలు అందులో భాగమనే భావనను సృష్టిస్తున్నారన్నారు. జమ్మూ కశ్మీర్ నెంబర్ ఉన్న వాహనాన్ని దిల్లీకి తీసుకెళ్లాలన్నా తాను కూడా భయపడతానని అన్నారు. ఎవరు ఎక్కడ వాహనాన్ని ఆపి, తనిఖీలు చేస్తారేమోనని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానని ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రస్తుతం జే–కే రిజిస్ట్రేషన్ వాహనాన్ని దేశరాజధానిలో నడపడం కూడా నేరంగా పరిగణిస్తున్నారన్నారు. "అందరూ మనల్ని అనుమానాస్పద దృష్టితో చూస్తున్నప్పుడు, వేరొకరు చేసిన పనికి మనల్ని కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, కొద్దిమంది చేసే పనులకు అందరినీ బాధ్యులుగా చూస్తున్నప్పుడు మనం బయటకు వెళ్లడం కష్టమనిపిస్తుంది. అందువల్లే ప్రస్తుత పరిస్థితుల్లో కశ్మీర్ ప్రజలు తమ పిల్లలను బయటకు పంపడానికి ముందుకు రావట్లేదు. కానీ మనం ఏమి చేస్తున్నామనేదే వాస్తవం" అని ఒమర్ అబ్దుల్లా అన్నారు. దిల్లీ పేలుడు కేసులో ప్రధాన నిందితుడు డా.ఉమర్‌తో సంబంధమున్న ఇతర డాక్టర్లను దిల్లీ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరందరికీ ఫరీదాబాద్‌లోని అల్–ఫలా యూనివర్సిటీతో సంబంధం ఉండడంతో అక్కడ చదివిన విద్యార్థులు, సిబ్బందిపై భద్రతా బలగాలు నిఘా పెట్టాయి. దాదాపు 200మంది కశ్మీర్ వైద్యులపైన, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువున్న కశ్మీర్ విద్యార్థులపైనా నిఘా పెట్టినట్లు అధికారులు తెలిపారు. కశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# మళ్లీ 26 వేల ఎగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ 26 వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 84,643.78 పాయింట్ల (క్రితం ముగింపు 84,673.02) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయం కాసేపు నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ఈ క్రమంలోనే 85,236.77 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 513.45 పాయింట్ల లాభంతో 85,186.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 142.60 పాయింట్ల నష్టంతో 26052.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.58గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీఎంపీవీ, మారుతీ సుజుకీ, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.39 డాలర్లు, బంగారం ఔన్సు 4115 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.







## గూగుల్ ప్లే బెస్ట్ యాప్స్..

### టాప్‌లో జొమాటో డిస్ట్రిక్ట్ యాప్

ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉత్తమ యాప్స్ జాబితాను ప్రకటించింది. భారత్‌లో ఈ ఏడాది అత్యంత ప్రజాదరణ పొందిన ప్లేస్టోర్ అప్లికేషన్లు, గేమ్స్ జాబితాను వెలువరించింది. వినియోగదారుల అభిరుచులు, స్థానిక సంస్కృతికి అనుగుణంగా రూపుదిద్దుకున్న యాప్స్ ఆదరణ పొందినట్లు గూగుల్ పేర్కొంది. దేశీయంగా ఉత్తమ యాప్‌గా జొమాటోకు చెందిన డిస్ట్రిక్ట్ (మూవీస్ ఈవెంట్స్ డైనింగ్) ఎంపికైంది. గేమ్ విభాగంలో కుకీ రన్ ఇండియా (రన్నింగ్ గేమ్) ఉత్తమ గేమ్‌గా నిలిచింది. ఈ మేరకు గూగుల్ తన బ్లాగ్ పోస్ట్‌లో యాప్స్ జాబితాను విడుదల చేసింది. జొమాటోకు చెందిన డిస్ట్రిక్ట్ యాప్ ఈ ఏడాది ఎక్కువ ఆదరణ పొందిన యాప్‌గా నిలిచింది. టూన్‌సూత్రా ఈ ఏడాది హిడెన్ జెమ్ యాప్ అవార్డు అందుకుంది. డైలీ ప్లానర్ యాప్‌ను బెస్ట్ ఎవ్రీడే ఎసెన్షియల్ యాప్‌గా ఎంపిక చేశారు. ఫన్ విభాగంలో ఇన్‌స్టాగ్రామ్‌కు చెందిన ఎడిట్స్ యాప్ ముందంజలో నిలిచింది. పర్సనల్ గ్రోత్ విభాగంలో ఇన్‌వీడియో ఏఐ ఉత్తమ యాప్‌గా గూగుల్ ప్రకటించింది. ట్రెండింగ్ విభాగంలో.. షాపింగ్ కేటగిరీలో ఇన్‌స్టామార్ట్ ఈ ఏడాది అత్యంత ట్రెండింగ్ యాప్‌గా నిలిచింది. విద్యార్థుల కోసం ఉద్దేశించిన సీఖో, ఆర్ట్ అండ్ డిజైన్ విభాగంలో అడోబ్ ఫైర్‌ఫ్లై: ఏఐ జనరేటర్ అత్యధికంగా వాడుకలో ఉన్న యాప్‌లుగా గుర్తింపు పొందాయి. గేమింగ్ విభాగంలో కుకీ రన్ ఇండియా 2025లో బెస్ట్ గేమ్‌గా ఎంపికైంది. హారర్ సర్వైవల్ గేమ్ కమ్లాకు బెస్ట్ ఇండీ గేమ్ అవార్డు లభించింది. 'పిక్ అప్ అండ్ ప్లే' కేటగిరీలో కూడా కుకీ రన్ ఇండియా ముందంజలో ఉంది. భారత్‌లో రూపొందించిన ఉత్తమ గేమ్ విభాగంలో రియల్ క్రికెట్ స్వైప్, మల్టీ-డివైజ్ కేటగిరీలో డిస్నీ స్పీడ్‌స్టార్మ్ అవార్డులు గెలుచుకున్నాయి. మల్టీప్లేయర్ విభాగంలో 8 పూల్ ఫీవర్ టాప్ యాప్‌గా నిలిచింది.



## ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల..

### వేర్వేరు గ్రూప్‌ల్లో భారత్, పాక్

ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ 2026 షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జరగనున్న ఈ టోర్నీకి జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వనున్నాయి. ఆరంభ మ్యాచ్‌లో భారత్, యూఎస్‌ఏ తలపడతాయి. మొత్తం 41 మ్యాచ్‌లు నిర్వహిస్తుండగా 16 జట్లు పాల్గొంటాయి. టంజానియా తొలిసారి పోటీపడుతోంది. ఫైనల్‌కు హరారే వేదిక. గత ఎడిషన్ మాదిరిగానే ఈ సారి కూడా భారత్, పాకిస్థాన్ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నాయి. గ్రూప్-ఎలో భారత్, బంగ్లాదేశ్, యూఎస్‌ఏ, న్యూజిలాండ్.. గ్రూప్-బిలో జింబాబ్వే, పాకిస్థాన్, ఇంగ్లాండ్, స్కాట్లాండ్.. గ్రూప్-సిలో ఆస్ట్రేలియా, ఐర్లాండ్, జపాన్, శ్రీలంక.. గ్రూప్-డిలో టంజానియా, వెస్టిండీస్, అఫ్గానిస్థాన్, సౌతాఫ్రికా ఉన్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ప్రతి జట్టు గ్రూప్‌లోని మిగతా టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్-ఎ, గ్రూప్-డిలలో టాప్-3లో నిలిచిన జట్లు సూపర్-6కు అర్హత సాధిస్తాయి. మిగతా రెండు గ్రూప్‌లకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. రెండు సూపర్-6 గ్రూప్‌ల్లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరతాయి. సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే ఉంది. 2024లో జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా నాలుగోసారి ఛాంపియన్‌గా నిలిచింది. అత్యధికంగా భారత్ ఐదు టైటిళ్లు (2000, 2008, 2012, 2018, 2022) సాధించింది.



## ఒక్క పాయింట్ తేడాతో అగ్రస్థానాన్ని కోల్పోయిన రోహిత్ శర్మ

భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక్క పాయింట్ తేడాతో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ (782 పాయింట్లు) రెండు స్థానాలు ఎగబాకి నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రోహిత్ (781) రెండో స్థానానికి పడిపోయాడు. అఫ్గాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్ (764), శుభ్‌మన్ గిల్ (745), విరాట్ కోహ్లీ (725) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ ఒక్కో స్థానం మెరుగై వరుసగా ఎనిమిది, 16వ ర్యాంకుకు చేరుకున్నారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న రెండో కివీస్ ఆటగాడిగా డారిల్ మిచెల్ నిలిచాడు. అంతకుముందు 1979లో గ్లెన్ టర్నర్ మాత్రమే ఈ ఘనత సాధించాడు. మార్టిన్ క్రోవ్, ఆండ్రూ జోన్స్, రోజర్ ట్వోస్, నాథన్ ఆస్టిల్, కేన్ విలియమ్సన్, మార్టిన్ గప్తిల్, రాస్ టేలర్ వంటి ఆటగాళ్లు టాప్-5లో నిలిచినా వీరిలో ఒక్కరు కూడా నంబర్ ర్యాంక్‌కు చేరుకోలేకపోయారు. కోల్‌కతాలో భారత్‌తో జరిగిన తొలి టెస్టులో అర్ధ శతకం చేసిన సౌతాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా రెండు స్థానాలు జంప్ అయి ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. యశస్వి జైస్వాల్ ఐదు నుంచి ఏడో ర్యాంకుకు పడిపోగా.. శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు మెరుగై 11వ ర్యాంకులో ఉన్నాడు. రిషభ్ పంత్ నాలుగు స్థానాలు దిగజారి 12వ స్థానానికి పడిపోయాడు. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన జస్‌ప్రీత్ బుమ్రా నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. కుల్‌దీప్ యాదవ్ రెండు స్థానాలు మెరుగై 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అతడి కెరీర్‌లో బెస్ట్ ర్యాంక్ ఇదే. రవీంద్ర జడేజా నాలుగ స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌లో ఉన్నాడు.

## నా దృష్టిలో అది తప్పే కాదు

### భువనేశ్వర్ కుమార్



కోల్‌కతా పిచ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్న వేళ టీమ్ ఇండియా పేసర్ భువనేశ్వర్ కుమార్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో స్పిన్ పిచ్‌లు ఇప్పుడే కొత్తగా తయారు చేయడం లేదని, కొన్ని దశాబ్దాలుగా ఇదే కొనసాగుతోందని అన్నాడు. మరి అప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని భువీ పేర్కొన్నాడు. 'భారత్‌లో స్పిన్ పిచ్‌లు సిద్ధం చేయడం ఇదే మొదటిసారి కాదు. టీమ్‌ఇండియా గెలుస్తున్నంత కాలం ఎవరూ ఈ ప్రశ్నను అడగలేదు. నిజానికి గెలుపోటములు ఆటలో భాగం. ఇంతకుముందు భారత జట్టు ఎప్పుడూ ఓడిపోకుండా లేదు.. అలాగే ఇదే మొదటి ఓటమి కూడా కాదు. నా దృష్టిలో ఈ ఓటమితో అంతగా చింతించాల్సిన అవసరమైతే లేదు' అని భువనేశ్వర్ కుమార్ తన వాదనను వినిపించాడు. నలుగురు స్పిన్నర్లను ఆడించడంపై కూడా అతడు స్పందించాడు. 'పిచ్ స్పిన్‌కు అనుకూలంగా తయారైనప్పుడు నలుగురు స్పిన్నర్లను (అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్) ఆడించడంలో తప్పు లేదు. అది టర్నింగ్ ట్రాక్. మ్యాచ్ జరిగిన విధానాన్ని బట్టి చూస్తే టీమ్‌ఇండియా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగడంలో తప్పేమీ లేదు' అని భువీ పేర్కొన్నాడు. 'శుభ్‌మన్ గిల్ ఈ మధ్యే కెప్టెన్ అయ్యాడు. అతడికి కాస్త విశ్రాంతి కూడా అవసరం. మానసికంగా, శారీరకంగానూ అతడు కొంచెం రెస్ట్ తీసుకోవాలి. త్వరలోనే ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీ వల్ల గత 10 సంవత్సరాల్లో టీమ్‌ఇండియా బౌలింగ్ విభాగంలో చాలా మెరుగైంది. ఐపీఎల్‌లో ఆడిన అనుభవం బౌలర్లకు ఎంతో ఉపయోగపడుతోంది. అలాగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ వల్ల భారత జట్టుకు కొత్త బౌలర్లు దొరుకుతారు' అని భువనేశ్వర్ కుమార్ విశ్లేషించాడు.

## టీ20లపైనే హార్దిక్ పాండ్య ఫోకస్



భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఇప్పట్లో వన్డేలు ఆడే సూచనలు కనిపించడం లేదు. ఈ ఏడాది జరిగిన ఆసియా కప్ సూపర్4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా అతడు గాయపడ్డాడు. ఎడమ కాలి తొడ కండరానికి గాయం కావడంతో తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లో ఆడలేదు. ప్రస్తుతం కోలుకుంటున్న హార్దిక్.. వన్డేల మ్యాచ్‌లకు దూరంగా ఉంటాడని తెలుస్తోంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో ప్రస్తుతానికి ఆ ఫార్మాట్‌పైనే ఫోకస్ పెట్టాలని అతడు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. డిసెంబరులో సఫారీలతో, జనవరిలో న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా మూడు వన్డేల సిరీస్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల్లో హార్దిక్ ఆడడు. ఫిబ్రవరి-మార్చిలో టీ20 వరల్డ్ కప్ జరగనుంది. ఐపీఎల్ 2025 సీజన్ మొదలవుతుంది. మళ్లీ భారత్ 2026 జులైలో ఇంగ్లాండ్‌తో వన్డేలు ఆడనుంది.

## దక్షిణాఫ్రికా-ఎతో మూడో వన్డే

### ఇండియా-ఎ ఓటమి



**రాజ్‌కోట్:** దక్షిణాఫ్రికా-ఎతో మూడు అనధికార వన్డే మ్యాచ్‌ల సిరీస్‌ను ఇండియా-ఎ.. 2-1తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మూడో అనధికార వన్డేలో ఇండియా-ఎ 73 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా-ఎ 6 వికెట్లు కోల్పోయి 325 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఇండియా-ఎ 252 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (66, 66 బంతుల్లో 8 ఫోర్లు), ఇషాన్ కిషన్ (53, 67 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) మాత్రమే రాణించారు. రుతురాజ్ గైక్వాడ్ (25), అభిషేక్ శర్మ (11), తిలక్ వర్మ (11), రియాన్ పరాగ్ (17) నిరాశపర్చారు. చివర్లో టెయిలెండర్లు ప్రసిద్ధ్ కృష్ణ (23), మానవ్ సుతార్ (23) పోరాడినా ఫలితం లేకపోయింది. తొలుత సఫారీ జట్టు బ్యాటర్లలో ఓపెనర్లు లువాన్ డ్రే ప్రిటోరియస్ (123, 98 బంతుల్లో, 9 ఫోర్లు, 6 సిక్సులు), రివాల్డో మూన్సామి (107, 130 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులు) శతకాలు బాదారు. ఈ జోడీ తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 241 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. డెలానో పాట్జీటర్ (30) పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో ఖలీల్ అహ్మద్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా తలో రెండు వికెట్లు తీశారు.

## వెస్టిండీస్ బ్యాటర్ అరుదైన రికార్డు..

### క్రికెట్ చరిత్రలో తొలిసారి



వెస్టిండీస్ కెప్టెన్, వికెట్‌కీపర్ షై హోప్ క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం టెస్టు హోదా కలిగిన అన్ని జట్లపై అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా అవతరించాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో హోప్ (109, 69 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సులు) సెంచరీ చేసి ఈ ఘనత సాధించాడు. కివీస్‌పై అతను శతకం చేయడం ఇదే తొలిసారి. 32 ఏళ్ల షై హోప్.. ఇప్పటివరకు టెస్టుల్లో ఇంగ్లాండ్‌పై రెండు, భారత్‌పై ఒక సెంచరీ చేశాడు. వన్డేల్లో అఫ్గానిస్థాన్ (1), బంగ్లాదేశ్ (3), ఇంగ్లాండ్ (2), భారత్ (3), పాకిస్థాన్ (2), సౌతాఫ్రికా (1), శ్రీలంక (2), న్యూజిలాండ్ (1), ఐర్లాండ్ (1), జింబాబ్వే (1)పై సెంచరీలు చేశాడు. టీ20ల్లో ఇదే ఏడాది ఆస్ట్రేలియాపై ఓ శతకం బాదాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే వర్షం కారణంగా ఆటను 34 ఓవర్లకు కుదించగా.. న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత విండీస్ 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని కివీస్.. మూడు బంతులు మిగిలుండగానే ఛేదించింది. డేవాన్ కాన్వే (90బీ 84 బంతుల్లో)బీ రచిన్ రవీంద్ర (56, 46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు) మెరుపులు మెరిపించారు. టామ్ లాథమ్ (39, 29 బంతుల్లో), మిచెల్ శాంట్నర్ (34, 15 బంతుల్లో) చివర్లో దూకుడుగా ఆడి జట్టును గెలిపించారు.




## 1600 సిరీస్ వాడకంపై బ్యాంకులకు ట్రాయ్ డెడ్‌లైన్

**దిల్లీ:** బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగానికి చెందిన సంస్థలు చేసే కాల్స్‌కు 1600 సిరీస్ వాడకంపై టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ కీలక ముందుడుగు వేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, మ్యూచువల్ ఫండ్స్, ఇతర సంస్థలకు గడువు నిర్దేశించింది. ఆ గడువు నుంచి తమ వినియోగదారులకు సేవలందించే విషయమై చేసే కాల్స్‌కు 1600 సిరీస్ నంబర్‌నే తప్పనిసరిగా వాడాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ట్రాయ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకులు సహా అన్ని కమర్షియల్ బ్యాంకులు 2026 జనవరి 1లోగా 1600 సిరీస్‌ను అందిపుచ్చుకోవాలని ట్రాయ్ నిర్దేశించింది. మ్యూచువల్ ఫండ్స్, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు ఫిబ్రవరి 15ను గడువుగా పేర్కొంది. క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు మార్చి 15 నాటికి ఈ సిరీస్‌ను అందిపుచ్చుకోవాలని సూచించింది. సెబీ రిజిస్టర్డ్ ఇంటర్మీడియరీస్ స్వచ్ఛందంగా ఈ సిరీస్‌కు మారాలని పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీలు, కో-ఆపరేటివ్ బ్యాంకులు, రీజినల్ రూరల్ బ్యాంకులు, చిన్న కంపెనీలకు మార్చి 1 గడువు నిర్దేశించింది. సెంట్రల్ రికార్డ్‌కీపింగ్ ఏజెన్సీలు, పెన్షన్ ఫండ్ మేనేజర్లు ఫిబ్రవరి 15నాటికి ఈ సిరీస్‌కు మారాలంది. ఇన్సూరెన్స్ సెక్టార్‌కు ఈ సిరీస్‌ను వర్తింపజేసే విషయమై ప్రస్తుతం ఐఆర్‌డీఏఐతో చర్చలు జరుగుతున్నాయని ట్రాయ్ వివరించింది.



## భారత్‌పై 25% టారిఫ్‌లు తగ్గించాలి

### అమెరికాను కోరిన జీటీఆర్ఐ

భారత్‌పై 25 శాతం సుంకాలు తగ్గించాలని మేథోసంస్థ జీటీఆర్ఐ (గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్) అమెరికాను కోరింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించిన నేపథ్యంలో తమ దేశ వస్తువులపై టారిఫ్‌లు కొనసాగించడం అన్యాయమని వాదించింది. రష్యా చమురు కొనుగోలును భారత్ గణనీయంగా తగ్గించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా పేర్కొన్నారు. ఆ దిగుమతుల వల్లే సుంకాలు విధించామని, ఇప్పుడు వాటిని తగ్గిస్తామని ఇటీవల సంకేతాలు ఇచ్చారు. అమెరికా ఆందోళనలకు అనుగుణంగా భారత్ చర్యలు తీసుకుందని, ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే టారిఫ్‌లు ఉపసంహరించుకోవాలని జీటీఆర్ఐ కోరింది. ఈ తగ్గింపునకు వాణిజ్య ఒప్పందంతో ముడిపెట్టొద్దని సూచించింది. దీనిని వెంటనే అమలుచేయకపోతే.. వాణిజ్య చర్చల్లో పురోగతి ఆశించినమేర ఉండకపోవచ్చని హెచ్చరించింది. కాగా.. రష్యా చమురు కొనుగోలును తగ్గించాలని అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. మరోవైపు, అమెరికాతో వాణిజ్య అంతరం తగ్గించుకోవాలనే దిశగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ పరిణామాల వేళ.. అమెరికా నుంచి మన దేశానికి ముడి చమురు దిగుమతులు పెరిగాయి. 2022 తర్వాత ఈ అక్టోబరులో గరిష్ఠ స్థాయికి చేరాయి. మరోవైపు, అమెరికా ఆంక్షల తరవాత రిలయన్స్, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ లిమిటెడ్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ సంస్థలు రష్యా నుంచి చమురు దిగుమతులను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# వారణాసి నుంచి
# రణకుంభ పాట విడుదల

దిగ్గజ దర్శకుడు రాజమౌళి, మహేశ్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం వారణాసి. ఈ సినిమాకు కేఎల్ నారాయణ నిర్మాతగా వ్యవవహరిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీత అందించబోతున్నాడు. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కుంభ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. అయితే ఇటీవలే ఈ మూవీ గ్లోబ్ ట్రాటర్ పేరుతో ఈవెంట్‌ను జరుపుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇందులో పాడిన పృథ్వీరాజ్‌కి సంబంధించిన రణ కుంభ పాటను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రళయం ప్రళయం అంటూ సాగే ఈ పాట గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. వారణాసి సినిమాకు సంబంధించి ఇటీవలే రామోజీ ఫిల్మ్ సిటీలో గ్లోబ్ ట్రాటర్ అనే పేరుతో ఈవెంట్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుక మొదట ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో మాత్రమే స్ట్రీమింగ్ అయ్యింది. అయితే తాజాగా ఈ వేడుకకు సంబంధించిన మొత్తం వీడియోను చిత్రబృందం యూట్యూబ్ వేదికగా వదిలింది. గంట 37 నిమిషాల నిడివి కలిగిన ఈ వీడియో ప్రస్తుతం డిజిటల్ వేదికగా వైరల్‌గా మారింది. కాగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోకు వీక్షకుల సంఖ్య కూడా పెరుగుతోంది.



# నిన్న అదితి.. నేడు శ్రియ

## శ్రియ పేరుతో నకిలీ వాట్సప్..

నటి అదితిరావు హైదరి పేరుతో ఇటీవల నకిలీ వాట్సప్ క్రియేట్ చేసి ఒక వ్యక్తి ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో నటి శ్రియ శరణ్ ఈ నకిలీ వాట్సప్ బారినపడ్డారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. అభిమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాట్సప్ ఎవరిదో నాకు తెలియదు. దయచేసి ఇలాంటివారితో చాట్ చేసి మీ విలువైన సమయాన్ని వృథా చేసుకోకండి. ఇలా జరగడం నాకు బాధగా ఉంది. ఇది నేను కాదు.. ఈ నంబర్ నాది కాదు. దురదృష్టం ఏంటంటే.. ఈ వ్యక్తి నా సన్నిహితులను నేను కలిసి వర్క్ చేయనున్న వారికి మెసేజ్‌లు చేస్తున్నాడు. అందరూ అప్రమత్తంగా ఉండండి అంటూ శ్రియ తెలిపారు. తన పేరు, ఫొటో వినియోగిస్తూ ఓ వ్యక్తి ఫొటోగ్రాఫర్లను మోసం చేస్తున్నాడని, అలాంటి ఫేక్ అకౌంట్ నుంచి జాగ్రత్తగా ఉండాలంటూ నటి అదితిరావు హైదరి ఇటీవల విజ్ఞప్తి చేశారు. 'నా పేరుతో పాటు ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టుకొని.. ఫొటోషూట్స్ పేరిట పలువురు ఫొటోగ్రాఫర్లకు మెసేజ్ చేస్తున్నట్టు తెలిసింది. ఫొటోషూట్ లాంటి వాటికోసం ఎవరినైనా కాంటాక్ట్ అవ్వాలన్నా.. నేను వ్యక్తిగత ఫోన్ నంబరు వాడను. నా టీమ్ ద్వారానే వారిని సంప్రదిస్తుంటా. ఒకవేళ మీకు ఇలాంటి మెసేజ్‌లు వస్తే.. మా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలియజేయండి' అని పేర్కొన్నారు.

# ఆంధ్రా కింగ్ తాలూకా ట్రైలర్ విడుదల



టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పి. మహేష్ బాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్‌మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే ఈ చిత్రంలో రామ్.. ఒక సూపర్ స్టార్‌కి వీరాభిమానిగా కనిపించనున్నారు. కన్నడ స్టార్ ఉపేంద్ర గారు పోషించిన ఆంధ్రా కింగ్ పాత్రకు రామ్ ఎంతటి డైహార్డ్ ఫ్యాన్ అనే అంశాన్ని ట్రైలర్ హైలైట్ చేసింది. రామ్ పోతినేని ఎనర్జీ, మాస్ డైలాగ్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ వంటి ప్రముఖ నటులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తున్నారు.

# డిసెంబర్ 31 నుంచి నటనకు ఇక స్వస్తి

## సినీ ప్రస్థానానికి గుడ్‌బై చెప్పిన నటి తులసి

ప్రముఖ నటి తులసి తన దశాబ్దాల సినీ ప్రస్థానానికి ముగింపు పలికారు. డిసెంబరు 31 నుంచి అధికారికంగా రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. తన రిటైర్‌మెంట్ జీవితాన్ని షిరిడీ సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపి అభిమానులను భావోద్వేగానికి గురిచేశారు. 1967లో బాలనటిగా రంగప్రవేశం చేసిన తులసి ఇప్పటి వరకు సుమారు 300కు పైగా తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఇటీవలి వరకు ఆమె అనేక సినిమాల్లో క్యారెక్టర్ పాత్రలు వేసి మెప్పిస్తూ వచ్చారు. డిసెంబరు 31న షిరిడీ దర్శనానికి వెళ్తున్నానని, ఆ రోజు నుంచే తన రిటైర్‌మెంట్ ఉంటుందని ప్రకటించారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని సాయిబాబాకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 1967లో తులసి సినీ రంగ ప్రవేశం చేశారు. 1974లో బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ చిత్రం ఆరంగేట్రంలో బాలనటిగా ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, భోజ్‌పురి భాషల్లో సుమారు 300 చిత్రాల్లో నటించారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. ఆనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీ ఎంట్రీ ఇచ్చారు. విశ్వనాథ్ సినిమాల్లో ఎక్కువగా నటించిన తులసికి బాలనటిగా శంకరాభరణం ఎనలేని కీర్తిని తీసుకు వచ్చింది. ఆ తర్వాత చిరంజీవి హీరోగా వచ్చిన శుభలేఖ సినిమాలో సుధాకర్‌కు జోడీగా మెప్పించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.





# ఒకప్పుడు ఇలా ఆలోచించలేదు..

## దీపికా పదుకొణె

తన 18 ఏళ్ల కెరీర్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు నటి దీపికా పదుకొణె. 'ఓం శాంతి ఓం' నుంచి 'కల్కి 2898 ఏడీ' వరకూ ఎన్నో బ్లాక్‌బస్టర్‌లలో నటించిన దీపికా.. కొన్నిసార్లు స్క్రిప్ట్ ఎంపికల్లో తప్పులు చేసినట్లు వెల్లడించారు. ఈ ఎంపికలపై విచారం వ్యక్తం చేశారు. " రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు. దీనికి విరుద్ధమైన వాస్తవాలు కూడా ఉంటాయి. కొన్ని ప్రాజెక్ట్‌లు కమర్షియల్‌గా హిట్ కాకపోవచ్చు.. అవి పెద్ద సినిమాలు కూడా కాకపోవ చ్చు. కానీ, నేను ఆ వ్యక్తుల ను ఆ కథలోని సందేశాన్ని నమ్మి వాటిని అంగీకరిస్తాను. దానికోసం నిలబడతాను. గతంలో ఇంత స్పష్టంగా ఆలో చించలేకపోయాను. ఇప్పుడు ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నా. కొన్నిసార్లు వెనక్కి తిరిగి చూసుకున్న ప్పుడు 'అప్పుడు ఏం ఆలోచించాను' అని అనిపిస్తుంది. బహుశా 10 సంవత్సరాల తర్వాత నేను ప్రస్తుతం ఎంపిక చేసుకున్న వాటి విషయంలోనూ ఇలానే ప్రశ్నించుకుంటానేమో.. ఎందుకంటే ఇదంతా నేర్చుకో వడంలో భాగం" అని చెప్పారు. ఇక ప్రస్తుతం దీపికా రెండు భారీ సినిమాల్లో నటిస్తున్నారు. షారుక్ సరసన 'కింగ్'తో అలరించను న్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం లో యాక్షన్ ఎంట ర్‌టైనర్‌గా ఇది రానుంది. సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్, రాణీముఖర్జీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వచ్చే ఏడాది వేసవిలో ఇది విడుదల కానుంది. దీనితో పాటు అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో రానున్న చిత్రంలోనూ దీపికా నటిస్తున్నారు.

# మరో వివాదంలో నటుడు ధనుష్

## టీవీ నటి మాన్యా ఆనంద్ సంచలన వ్యాఖ్యలు



నిత్యం ఏదో ఓ వార్తలో ప్రధానంగా నిలిచే తమిళ స్టార్ హీరో ధనుష్ పై మరో కొత్త వివాదం రేగింది. ఈసారి ప్రముఖ టీవీ నటి మాన్యా ఆనంద్ చేసిన సంచలన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించిన విషయాలు ఇప్పుడు తమిళ సినీ పరిశ్రమలో పెద్ద కలకలం రేపుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ధనుష్ హీరోగా చేస్తున్న ఓ సినిమాలో ముఖ్యమైన పాత్ర ఇస్తామని చెప్పి ఆయన మేనేజర్ శ్రేయాస్ తనను సంప్రదించాడని, నేను కూడా 'ఒక మంచి అవకాశం వస్తుందని నిజంగా నమ్మాను. కానీ రోజులు గడిచేకొద్దీ వాళ్లు అడిగిన మాటలు, ప్రవర్తన చూసి నేను షాక్ అయ్యానని పేర్కొంది. పాత్ర కోసం కొన్ని కమిట్‌మెంట్‌లు ఇవ్వాలి అని సూచిస్తూ, ధనుష్‌తో అడ్జస్ట్మెంట్ చేయాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆరోపించింది. వారి అసలు ఉద్దేశం త్వరగానే తెలుసుకుని నేను జాగ్రత్త పడ్డానని కానీ పాత్ర కోసం మహిళలపై ఇలాంటి ఒత్తిడి తేవడం చాలా తప్పని మాన్యా ఇంటర్వ్యూలో తెలిపింది. ఆ విషయం నన్ను తీవ్రంగా కలచివేసిందని వివరించింది. ఇంకా మాన్యా మాట్లాడుతూ..ఇలాంటి ఒత్తిళ్లు, అడ్జస్ట్మెంట్ పేరుతో జరిగే అనైతిక డిమాండ్లు చిత్రపరిశ్రమలో ఇంకా కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చే నటీమణులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు భయంతో బయట పెట్టలేరని, ఈ విషయాలు బహిరంగంగా చెప్పడానికి చాలా ధైర్యం కావాలని, తనలాంటి వారు మాట్లాడితేనే మార్పు వస్తుందని ఆమె అన్నారు. అయితే.. అమె ఈ ఘటన ఎప్పుడు జరిగింది, ఏ సినిమా విషయంలో చోటు చేసుకున్నది, ఇప్పుడే ఎందుకు బయట పెట్టిందనే విషయాలు మాత్రం చెప్పలేదు. అయితే అయితే ధనుష్, లేదా ఆయన టీమ్, మేనేజర్ శ్రేయాస్ ఈ ఆరోపణలపై ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. అయితే.. వైరల్‌గా మారిన ఈ వివాదంపై అరోపణలు చేసిన నటి మాన్యా ఆనంద్ స్పందించి ఇన్స్టాలో ఓ న్యూస్ షేర్ చేసుకుంది. నా ఇంటర్వ్యూ అధారంగా చాలా ఛానళ్లు ధనుష్‌పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని స్పష్టం చేసింది. దయచేసి ఒరిజినల్ వీడియోను చూసి ఓ నిర్ణయానికి వచ్చి మట్లాడండి అని కోరింది. నన్ను సంప్రదించిన వ్యక్తి తన పేరు శ్రేయాస్ అని చెప్పుకుంటూ సినిమాకి అవకాశాలు ఇస్తానని మాట్లాడిన వ్యక్తి నిజమైనవాడు కాకపోవచ్చని నేను ఆ వీడియోలో స్పష్టంగా పేర్కొన్నానని, ఆ నంబర్‌ను ధనుష్ సర్ టీమ్‌కు పంపించి నిజానిజాలు తెలుసుకుంటానని కూడా చెప్పానని వివరించింది. అందరూ దయచేసి తప్పుడు వార్తలు వైరల్ చేయవద్దని వేడుకుంది..ట్రోలింగ్, వైరల్ చేసే ముందు ఒరిజినల్ వీడియోను చూడండి అని కోరింది. మాన్య గతంలో తెలుగులో జెమిని టీవీలో వచ్చిన భాగ్య రేఖ అనే సీరియల్‌లోనూ నటించింది.

# 24ఏళ్లు పూర్తి చేసుకున్న అమృతం సీరియల్

తెలుగు టీవీ చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిన కామెడీ సిట్‌కామ్ అమృతం ప్రసారమై 24 ఏండ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు ఈ సీరియల్ జ్ఞాపకాలను పంచుకుంటూ పోస్టులతో సందడి చేస్తున్నారు. 2001 నవంబర్ 18న జెమిని టీవీలో ప్రారంభమైన ఈ సిట్‌కామ్ 2007 నవంబర్ 18 వరకు విజయవంతంగా ప్రసారమైంది. ఆరు సంవత్సరాలలో దాదాపు 313 ఎపిసోడ్‌లతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. అమృతం కేవలం కామెడీ సీరియల్ మాత్రమే కాదు మధ్య తరగతి జీవితంలోని సమస్యలు, ఆశలు, నిరాశలను హాస్యం రూపంలో అద్దం పట్టించింది. ప్రముఖ నిర్మాత, రచయిత గుణ్ణం గంగరాజు ఈ హాస్య ధారావాహికను సృష్టించి, నిర్మించగా.. అమృతం పాత్రలో శివాజీ రాజా, నరేష్, హర్షవర్ధన్ కాలానికి అనుగుణంగా నటించారు. అంజి పాత్రలో గుండు హనుమంతురావు నటించగా.. సర్వం పాత్రలో వాసు ఇంటూరి, అప్పాజీ పాత్రలో శివన్నారాయణ నరిపెద్ది నటించి మెప్పించారు.




Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com